సాంఘిక, ఆర్థిక పోరాటాలు బొమ్మ బొరుసు వంటివి !

చార్వాక కేలండర్




చార్వాక ఆశ్రమం నిడమర్రు - 522 503. ✆ 9290619550

అన్ని రంగాలలో ప్రత్యామ్నాయాన్ని రూపొందించకుండా వ్యవస్థనుమార్చటం కల్ల !

చార్వాక శకం : 5022 బూటకపు శకం : 2022

కులం పునాదులు

The Foundations of the Caste



రచన :

డా॥ ఆర్.కె

చార్వాకాశ్రమ ప్రచురణ

మాతృభాష

సీ. అచ్చమైన తెలుగు అమ్మ భాష మనది
స్వచ్ఛమైన తెలుగు పసిడి భాష
యేబది యారైన యింపువర్ణాలతో
తేనెలొలుకు భాష తెలుగు భాష
అచ్చులు, హల్లులు నక్షరాల తెలుగు
ఒత్తులు, సంధులు నున్న భాష
హ్రస్వాలు, దీర్ఘాలు నలరు విభక్తులు
అపురూప ఛందస్సు విపుల భాష

తే.గీ. పలు యలంకారములు గల్గి వెలుగు భాష
సామెతలు, సమాసమ్ములు శాస్త్రభాష
స్పష్టతయు, శ్రావ్యతయు కూడి సరస భాష
అద్భుత మవధాన సహిత మమృత భాష
పద్యరచనల కనువైన హృద్యభాష
దివ్య కావ్య సమున్మేష తెలుగు భాష.

– డా॥ అయినాల మల్లేశ్వరరావు
(జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత)

శాస్త్రవేత్త కొత్త సత్యము కనుగొన్న
బాహిరిల్లు కొత్త ప్రశ్నలెన్నొ :
కొత్త ప్రశ్న లేక కొత్త జ్ఞానము లేదు!
నవయుగాల బాట! నార్లమాట!

ఈ కేలండర్ గురించి

మనం యిప్పుడు వాడుతున్న కేలండరుకు చాలా పెద్ద కథ వుంది. ఎన్నో రకాల వేషాలు మార్చుకొని యిప్పుడు ఈ రూపం ఎత్తింది.

కేలండరు అనే పదం మొదట్లో రోమన్లు వాడారు. ఆ భాషలో దీనికి 'ఎకౌంట్' పుస్తకం అని అర్థం.

ఈనాటి కేలండర్ నమూనా 5000 సంవత్సరాల క్రితం ఈజిప్షియన్లు తయారు చేశారు. సంవత్సరానికి 365 రోజులు, 12 నెలలు ఒక సంవత్సరమని నెలకి 30 రోజులని ఆ కాలంలోనే చెప్పారు. ప్రతి మూడేళ్లకి 5 అధిక దినాలొస్తాయని చెప్పలేకపోయారు.

ప్రస్తుతం యిప్పటి కేలండరును రూపుదిద్దినవాడు రోము చక్రవర్తి జూలియస్ సీజర్. గ్రీకు, ఈజిప్టు ఖగోళశాస్త్ర నిపుణుడు సోసీ జెనీస్ అనే విద్వాంసుడు జూలియస్ సీజర్‌కు సాయం చేశాడు. ఇది యిప్పటికి 2054 సంవత్సరాల నాటి సంగతి. సంవత్సరానికి 365 రోజులుగా, నాలుగు సంవత్సరాల కొకసారి 366 రోజులుగా లీపు సంవత్సరం రావడం ఆనాడే ఏర్పరచబడింది.

జూలియస్ సీజర్ హత్య చేయబడ్డాక యితడి అన్న కొడుకు ఆగస్టస్ రాజ్యానికొచ్చి తగుదునమ్మా అని దీన్ని కొంత కెలికి మార్పించాడు.

అప్పటికే కొన్ని అవకతవకలుండటం వల్ల 16 వందల సంవత్సరాల తర్వాత పోప్ గ్రిగరీ–13 అనే రోమన్ కాథలిక్ జూలియన్ కాలెండర్‌ను అక్టోబరు 1582లో కొంత సంస్కరించాడు. అది కేవలం క్రైస్తవ మత ప్రయోజనం మాత్రమే. దీన్ని గ్రెగరీ కేలండరు అంటారు. మనం యిప్పుడు ప్రపంచమంతటా వాడుకునే కేలండరు ఇదే. ఈ గ్రెగోరియన్ కేలండరును అన్ని దేశాలు వెంటనే అంగీకరించలేదు. 1582 నుండీ వివిధ దేశాలు వివిధ సంవత్సరాలలో దీనిని వాడుకలో పెట్టాయి. చివరగా 2016లో సౌదీ అరేబియా అమలు చేసింది.

ఫ్రెంచి విప్లవం వచ్చిన తరువాత వాళ్ళు కేలండరులో మార్పులకు ప్రయత్నించారు. నెలల పేర్లు మార్పులు చేయాలని నిశ్చయించారు. కాని అది ప్రచారం పొందలేదు.

ఇక శకాల సంగతి :

ప్రస్తుతం క్రీస్తుశకం వాడుకలో వుంది. క్రీస్తు పుట్టినప్పటినుంచీ కాలాన్ని లెక్కించటం మొదలైందని అంటారు. క్రీస్తు జన్మే అబద్ధం, ఇది క్రైస్తవ మత ప్రచారకుల ఎత్తుగడ మాత్రమే. క్రీస్తు శకం ఒక్కటే కాకుండా ప్రపంచంలో చాలా శకాలు ప్రచారంలో వున్నాయి. అయితే ప్రపంచం మొత్తం మీద కాలం గుణించటం ఒకే మాదిరిగా వుండాలనే భావం రావటంతో యిష్టం వున్నా లేకపోయినా అన్ని దేశాలవాళ్ళు దీన్ని ఆమోదించటం జరుగుతోంది. కాకపోతే సోషలిస్టు దేశాలు కూడా దీన్ని పాటించటంలో అర్థం లేదు.

మన దేశంలోనే విక్రమార్క శకం, శాలివాహన శకం లాంటివి వున్నాయి.

దీని సంగతి :

క్రీస్తు జన్మ అబద్ధం కాబట్టి క్రీస్తు శకాన్ని బూటకపు శకంగా భావిస్తున్నాం. చార్వాక ఉద్యమం క్రీస్తు శకానికి ముందు దాదాపు 3000 సం॥రాల నుంచి వుందనే ప్రచారం వుంది. దాన్ని దృష్టిలో పెట్టుకొని చార్వాక శకాన్ని ప్రవేశపెట్టాము. అంతకు ముందు జరిగిన ఘటనల్ని చా.పూ. అని లెక్కించుకొనవచ్చు. ఇది నా భావన మాత్రమే.

మొత్తం మీద సోషలిస్టు దేశాలైనా ఆలోచించి మతాన్ని వివిధ రంగాల్లో జొరనీయకుండా చేయటం కోసం ఏదైనా ముఖ్యఘట్టాన్ని ప్రమాణంగా తీసుకొని కాలాన్ని కొలవటం మొదలు పెడితే మంచిది. మతం పట్టు సడలుతుంది.

ఆదివారం గాక బుధవారం మొదటిరోజుగా తీసుకొన్నాం. ప్రస్తుతం మనం బుధవారాన్ని ఏ మతానికి వాడుకోవడటం లేదు. అందుకే దీంట్లో బుధవారానికి ప్రాధాన్యం యిచ్చాం.

ముఖ్యమైనవారి పుట్టుకలు, మరణాలు, తేదీలు యిచ్చాం. కొన్ని ముఖ్య ఘట్టాల్ని గ్రహించాం; కొన్ని రోజుల్ని పండుగ దినాలుగా ప్రకటించాం. భౌతికవాదులు తప్పకుండా వీటిని అమలు పరుస్తారని ఆశిస్తాం. లేకపోతే మన సంస్కృతికి రూపమే లేకుండా పోతుంది.

నెలల పేర్లు ఆయా కాలల్లో వుండే శీతోష్ణ పరిస్థితులను బట్టి పెడదామన్న తలంపు కలిగింది; కాని అది అంతగా అతుకుతున్నట్టు కనిపించలేదు.

కాగా ఆయా రంగాల్లో ప్రపంచంలో శ్రమించి, జీవితాల్ని అందుకై త్యాగం చేసిన త్యాగధనుల పేర్లు మంచిదని భావించి యిట్లా చేశాం. వీరేగాక చరిత్రలో యింకెంతోమంది త్యాగమూర్తులున్నారు. కాని యిక్కడ మనకు పన్నెండు నెలలే గదా వుంది. అందుకని పన్నెండు మందినే తీసుకోవలసివచ్చింది. వీరు మాత్రమే గొప్పవారనీ, తక్కినవారు తక్కువవారనీ తలంపరాదు.

ఇది కేవలం పంతం కోసం చేస్తున్న పనిగా తలంపక భౌతికవాద సంస్కృతి నిర్మాణానికి సోపానంగా పనికివస్తుందేమోనన్న తపనతో చేస్తున్న ప్రయత్నంగా భావించాలని మిత్రులకు మనవి చేస్తున్నా...

- బి. రామకృష్ణ

*****

ఇది 5022 సం॥ర కేలండర్. గత కేలండర్లకు మిత్రుల నుంచి ఎంతో ఆదరణ, ప్రోత్సాహం లభించాయి. దీన్ని కూడా అట్లాగే ఆదరిస్తారని భావిస్తున్నాము.

ఈ కేలండర్‌లో ప్రచురించిన వ్యాసాన్ని ప్రముఖ వైద్యులు, సైన్సు పుస్తకాల రచయిత డా॥ ఆర్.కె. గారు అందించారు. ఆయనకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నాం.

ప్రతులకు : చార్వాకాశ్రమం, నిడమర్రు - పోస్టు, మంగళగిరి మండలం,
గుంటూరు జిల్లా - 522 503, 9290619550.

క్రయం : రూ. 30-00

కులం పునాదులు

(The Foundations of the Caste)

కులం ఏనాటిది? ఎలా పుట్టింది? ఎక్కడా ఏ మతంలోనూ లేని కులం భారత ఉపఖండంలోనే, హిందూమతంలోనే ఎందుకు పాతుకుపోయింది? కులం లేని హిందువులేడు. ఏ హిందువూ కులానికతీతుడు కాదు. కులం పుట్టుకతోనే వస్తుంది. వంశపారంపర్యంగా వెన్నాడుతుంది. కులాల మధ్య పెళ్ళిళ్లు లేవు. సహపంక్తి భోజనాలు లేవు. ఆచారాలు, కట్టుబాట్లతో కులం కట్టివేయబడింది.

కులం నిచ్చెనమెట్లలాంటిది. పై మెట్లపై బ్రాహ్మణులు, క్షత్రియులు, మధ్య వైశ్యులు, ఆ తర్వాత శూద్రులు. అట్టడుగున కులంలేని అంటరానివారు. చట్టాల్ని ప్రక్కన పెడితే, శతాబ్దాలుగా, తరాలు సాగిన పోరాటాలు కొన్ని సంస్కరణల్ని ప్రవేశపెట్టినా కులం మౌలిక చట్రం మారలేదు. పాలకులెవరైనా కులవ్యవస్థను పదిలంగా భద్రపరిచారేగాని దానిని రూపుమాపటానికి ప్రయత్నించలేదు. హిందూమత సంఘసంస్కర్తలు ఆ మతంలోని కొన్ని దురాచారాలపై దండెత్తారేగాని, కులాన్ని నిర్మూలించే దిశగా అసలు ఆలోచన చేయలేదు.

కులం ఎలా పుట్టింది?

సనాతన ధర్మం సులువుగా చెప్పింది.

సృష్టికర్త బ్రహ్మముఖం నుండి బ్రాహ్మణులు, భుజాల నుండి క్షత్రియులు, తొడల నుండి వైశ్యులు, పాదాల నుండి శూద్రులు పుట్టారని రుగ్వేదం పురుష సూక్తం, శ్లోకం 10:90లో జేర్చబడింది. ఇది బ్రాహ్మణ ఆధిపత్యంపై మతమౌఢ్యం యిచ్చిన చివరి తీర్పు.

కులాన్ని దేవుడికి ముడిపెట్టారు. గుణంతో తూకం వేశారు. పూర్వజన్మ సుకృతం అన్నారు. ఎవరి కర్మలను వారు ఆచరించాలి. ఎవరి కుల ధర్మాన్ని వారు పాటించాలి. అప్పుడే మరోజన్మలో ఉన్నత కులంలో పుడతారని హితబోధ చేశారు. కులాన్ని సమాజానికతీతంగా చూపారు. భారత ఉపఖండం సామాజిక ఉత్పత్తి క్రమంలో ఒక భాగంగా కులం వచ్చిందనే నిజాన్ని మరుగుపర్చారు. ఇపుడు చరిత్ర పుటలలోకెళ్లి వాస్తవాలందరికి జేరే ప్రయత్నం చేద్దాం.

ఆర్యులు - అనార్యులు

వేదాలతోనే మన చరిత్ర ప్రారంభం కాలేదు. ప్రపంచంలోని అతి ప్రాచీన నాగరికతలలో మనది ఒకటి. క్రీ.పూ. 2600 –1800 నాటికి సింధునదీ తీరంలో హరప్పా సంస్కృతి వర్ధిల్లింది. ఆ కాలానికి వర్ణం లేదు. కులం లేదు. నగర నాగరికత గనుక వర్గాలున్నాయి. పాలకులు,

పాలితులున్నారు. వ్యాపారులు, వ్యవసాయదారులు, చేతివృత్తులవారున్నారు. మంత్ర తంత్రగాళ్లున్నారు. మత భావనలున్నాయి. మాతృస్వామికం కూడా వుండేది. బానిసలు కూడా వున్నారనే అభిప్రాయం ఒకటి వుంది.

క్రీ.పూ. 1500లో ఆర్యులు వాయువ్య భారతంలోని సప్త సింధు నదీతీరాలకు వలస వచ్చారు. అప్పటికి 300 సంవత్సరాలకు ముందే హరప్పా సంస్కృతి అంతమైంది. ఆర్యుల దాడుల వలన హరప్పా నశించిందనటానికి ఆధారాలు లేవని కొశాంబి మినహా ఇతర చరిత్రకారుల అభిప్రాయం. ఆర్యులకు, అప్పటికి అక్కడున్న హరప్పావాసులకి ఘర్షణలు జరిగి వుండొచ్చు. అవి చెప్పుకోదగిన సంఘటనలు కావు.

ఆర్యుల సంస్కృతి హరప్పా సంస్కృతికి భిన్నమైనది. ఆర్యులది సంస్కృత భాష .లిపి లేదు. గుర్రం స్వారీ, యుద్ధంలో ఆరితేరినవారు. ఇంద్రుడు, వరణుడు, అగ్ని, మిత్ర వారి దేవుళ్ళు. యజ్ఞయాగాదులు, కర్మకాండలు, దహనసంస్కారాలు చేస్తారు. ఈ ఆచార, సంప్రదాయాలు వారికి మధ్య ఆసియాలోని బాక్ట్రియా – మార్జియానా సంస్కృతి (Bactria-Margiana Archaeological Complex BAMC) నుండి సంక్రమించింది. బాక్ట్రియా – మార్జియానా భూభాగం ఆఫ్ఘనిస్తాన్, ఉజ్జెక్తిస్తాన్, తజకిస్తాన్‌లలో భాగంగా, హిందుకుష్ పర్వతాలు – ఓక్సస్ నది మధ్య వుంది. భారత ఉపఖండంలోకి ప్రవేశించకముందు ఇండో ఆర్యులు క్రీ.పూ. 1900–1700 మధ్య ఇక్కడి తెగల సంస్కృతితో సంపర్కం కలిగి వున్నారు.

ఆర్యుల రాకతో తొలివేదయుగం ప్రారంభమై క్రీ.పూ. 1000 వరకు కొనసాగింది. ఈ కాలం చరిత్రకు రుగ్వేదమే ఆధారం. ఒకే భాష, ఒకే జీవన విధానంగల ఆర్యులు పశుపాలక తెగలు. రక్తసంబంధమే వారిని తెగలుగా వ్యవస్థీకృతం చేసింది. వ్యవసాయంలో ఓనమాలు దాటకపోవటంతో ఒకే ప్రాంతంలో సుదీర్ఘకాలం స్థిరనివాసం లేరు. రాజ్యవ్యవస్థ తెలియదు. వర్గాలు లేవు. వర్ణాలు లేవు. కులాలు లేవు. పశుమందలు, ఆయుధాలు, ఆభరణాలు వారి సొంత ఆస్తి. భూమి అందరిదీ. పితృస్వామికం అమలులో వుంది.

నగర నాగరికత, వ్యాపారం, సముద్రయానం, లిపి బొత్తిగా తెలియని ఆర్యులు హరప్పా నాగరికతకు సాటిరారు. ఒక అభివృద్ధి చెందిన నగర నాగరికత స్థానే ఒక వెనుకబడిన పశు పాలక సమాజం అవతరించింది. ఇది భారత ఉపఖండ చరిత్రలో కీలక పరిణామం.

భారత సామాజిక స్వరూపం మారింది. ఉపఖండంలో ఇపుడు ఆర్యులున్నారు. అనార్యులున్నారు. ఆర్యులది తెల్లని రంగు. అనార్యులది నల్లని రంగు. ముక్కు, ముఖంలో తేడాలున్నాయి. రంగు వివక్షత వాస్తవమే అయినా అదే ఆర్య, అనార్య యుద్ధాలకు మూలమనే పాశ్చాత్య చరిత్రకారుల భావన సరికాదు.

రుగ్వేదంలో దాసుల, దస్యుల, పణుల ప్రస్తావన వుంది. దాసు అంటే సేవకుడు లేదా బానిస అని అర్థం. దాసు అనే పేర్లతో తెగల నాయకులు కూడా వున్నారు. భరత తెగకు సుదాసు, దివోదాసు నాయకత్వం వహించారు. 'దాస' అనే పదం ఇరాన్ సాహిత్యంలో 'దహే'గా వుంది. భారతదేశానికొచ్చిన తొలి ఆర్య తెగలలో దాసులు ఒకరై వుండొచ్చునని ఆర్.ఎస్. శర్మ అభిప్రాయం.

దస్యులు స్థానిక స్థిరనివాసులు. వ్యవసాయం వృత్తిగా గలవారు. దక్షిణాదివారై వుండొచ్చు. అరణ్యాలలో వుండే ఆదివాసులై వుండొచ్చు. నల్లని రంగు, చప్పిడి ముక్కును అందవికారంగా వర్ణించి రాక్షసులుగా పురాణాలలో చిత్రీకరించారు. దస్యులు యజ్ఞయాగాదులు చేయరు. క్షుద్ర దేవతల్ని పూజిస్తారు. మంత్ర తంత్ర శక్తుల్ని ప్రదర్శిస్తారు.

పణులు హరప్పా నాగరికత పతనం తర్వాత మిగిలిన వర్తక శ్రేణులు కావచ్చునని కొశాంబి అభిప్రాయం. వారి జననివాసాలు లేదా కోటలు, సిరిసంపదలపై ఆర్యులు ఈర్ష్యా ద్వేషాలను వెళ్లగ్రక్కారు. వాటిని ధ్వంసం చేయమని ఇంద్రుడ్ని ప్రార్థించారు.

ఆర్య అనార్య యుద్ధాలేగాక, ఆర్యుల మధ్య అంతర్యుద్ధాలు కూడ జరిగాయి. ఈ యుద్ధాలలో ఆర్యులు దాస్యులపట్ల మెతకగాను, దస్యులపట్ల తీవ్ర శత్రుత్వంగాను వ్యవహరించటం గమనార్హం. రుగ్వేదంలో దస్యుల హత్యలను పలుమార్లు ప్రస్తావించారు. దాసులు, దస్యులను ఓడించి వారిని బానిసలను చేశారు.

బానిసలంటే గ్రీకు, రోమ్ బానిస వ్యవస్థలతో సాపత్యం కూడదు. అది గనులు, తోటలు, పెద్ద పెద్ద భూఖండాలు, చేతి పరిశ్రమలతో బానిస శ్రమ పునాదిగా అభివృద్ధి చెందిన ఆర్థికవ్యవస్థ. ఇది ఇళ్ల పనులకే, అదీ ఆడవారికే పరిమితమైన దాసీ వ్యవస్థ. సంఖ్య తక్కువ. తెగల యుద్ధాలలో జరిగే విపరీత జన నష్టాన్ని పూడ్చటానికి దాసీ జనాన్ని దగ్గరకు తీయాల్సిన అవసరం ఏర్పడింది. అప్పటికి వ్యవసాయం, చేతి పనులలోకి పురుష బానిసలు ప్రవేశించలేదు.

కాలపరిణామంలో ఆర్య, అనార్య తెగల మధ్య ఖచ్చితమైన విభజనలు చెరిగిపోయాయి. దశరాజ యజ్ఞ యుద్ధంలో ఐదు ఆర్య, ఐదు అనార్య తెగలు కలిసి భరత తెగతో యుద్ధం చేశారు. ఆర్యుల అంతర్యుద్ధాల వలన వారి తెగల ప్రాభవం తగ్గిపోయింది. ఈ తెగలు క్రమంగా విచ్ఛిన్నమై సామాజిక విభజనలో భాగమయ్యాయి. ఇది ఇంతటితో ఆగిపోలేదు. పంజాబ్ నుండి ఉత్తరప్రదేశ్, బీహార్‌లకు వలస వెళ్ళిన ఆర్యులు అవసరం బట్టి అనేక అనార్య తెగలను, ఆదివాసులను తమలో కలుపుకున్నారు. మహాభారతంలో కురు వంశానికి చెందిన ఆర్యపుత్రులెవరో, ఎవరు ఎవరికి పుట్టారో తెలియదు. సంచార పశుపాలక తెగలైన ఆర్యుల పరిశుద్ధ రక్తంపై ఎక్కువ భ్రమలు కూడదు.

శ్రమవిభజన – వర్ణం

క్రీ.పూ. 1000-500 మలివేదయుగం. ఇనుమును కనుగొన్నా ఇనుప పనిముట్లు వాడకంలోకి రాలేదు. కొయ్య నాగళ్లతో గంగామైదానంలోని మెత్తని భూములను దున్నసాగారు. వ్యవసాయం ప్రారంభమై బార్లీతోపాటు గోధుమ, వరి పండించారు. రాగి ప్రధాన లోహం. కమ్మరి, కుమ్మరి, నేత, వడ్రంగి, చర్మకారీ పనులు చేతివృత్తులుగా అభివృద్ధి చెందాయి. వ్యవసాయం, వస్తూత్పత్తిలో శ్రమ విభజన జరిగింది. శ్రమ విభజనతో మారకం, తెగల మధ్య సంబంధాలు పెరిగాయి. ఒకే ప్రాంతంలో విభిన్న తెగలు స్థిరనివాసం వుండసాగారు. తెగ స్థానే ప్రాంతం ప్రధానమైంది. సామాజికంగా పెనుమార్పులు సంభవించాయి.

శ్రమ విస్తృతమై ఉత్పత్తి అభివృద్ధి చెందినపుడు శ్రమ విభజన అనివార్యం. ఇది అసాధారణం కాదు. అన్ని దేశాలలోనూ చూడగలం. ప్రాచీన తెగలలో నాయకులు, పురోహితులు, యుద్ధవీరులు, మంత్రగాళ్లు, వ్యవసాయదారులు, చేతివృత్తులవారుగా శ్రమ విభజన జరిగింది. ఇది వృత్తిరీత్యా జరిగిన శ్రమ విభజన. అప్పటికి వృత్తిని పుట్టుకతో ముడివేయలేదు. వారసత్వం కాదు. ఒకే కుటుంబంలో అనేక వృత్తులవారుంటారు. అన్ని వృత్తులకు సమాన గౌరవం వుండేది. విభిన్న వృత్తుల కుటుంబాల మధ్య పెళ్ళిళ్ళు కూడ జరిగేవి. మలివేదయుగం తొలిదశలోని వృత్తి విభజన శ్రమ విభజనేగాని శ్రమజీవుల మధ్య విభజన కాదు. శ్రమ విభజనే భారత ఉపఖండంలో 'వర్ణం'గా వర్గీకరణ జరిగింది. మొదట మూడు వర్ణాలుగా విభజింపబడింది.

ఒకటి : బ్రాహ్మణులు లేదా పురోహితులు – పశుసంపదల సమృద్ధికోసం ఆర్య పురోహితులు యజ్ఞయాగాదులు, జంతు బలులు నిర్వహిస్తారు. దేవుళ్లకి విలువైన కానుకలు సమర్పిస్తారు. హరప్పా నాగరికతలో, స్థానిక అనార్యులలో కూడ మతభావనలున్నాయి. వ్యవసాయ పనులకి ముహూర్తం పెట్టి పూజాది కార్యక్రమాలతో ప్రారంభిస్తారు. మంత్ర తంత్ర విద్యలలో ఆర్య పురోహితులకంటె అనార్య పురోహితులే ఉద్దండులు. ఆర్య, అనార్య పురోహితులు 17 గ్రూపులుగా తమ కార్యకలాపాల్ని సాగించారు. వీరిలో ఆర్య పురోహితులు మిగిలినవారిని త్రోసిరాజని 'బ్రాహ్మణ వర్ణం'గా స్థిరపడింది. పశుసంపదలు, వ్యవసాయోత్పత్తులు కోసం జరిగే ప్రతి పని వీరి ఆధ్వర్యంలోనే జరుగుతుంటాయి.

రెండు : నాయకత్వం లేకుండా ఏ తెగ మన లేదు. తెగల పెద్దలు, యుద్ధవీరులు తెగ రక్షకులుగా నాయకులుగా ఉద్భవించారు. క్షత్రియ వర్ణంగా ఏర్పడ్డారు. క్షత్రియుడంటే క్షాత్ర తేజం గలవాడు. యుద్ధం, రక్షణ, పాలన వీరి పని. ఒకరిని 'రాజు'గా ఎన్నుకుంటారు. మలివేదయుగంలో 'ఎన్నిక' వెనుకబడి 'వారసత్వం' వచ్చింది. ఆర్యులే క్షత్రియులు కాదు. తెగలపై, ప్రాంతాలపై పాలనాధికారం గల అనార్యులు, ఆదివాసీలు, దండెత్తి వచ్చిన విదేశీ తెగల నాయకులు కూడ క్షత్రియులమని ప్రకటించుకున్నారు.

మూడు : వైశ్యులు లేదా సాధారణ ప్రజలు. – వైశ్యుడు అంటే వ్యవసాయం చేసేవాడు. పశుపోషణ, వ్యవసాయం, చేతిపనులు జీవనోపాధి కలిగి వుంటారు. శారీరక శ్రమ చేస్తారు. ఉత్పత్తి కార్యకలాపాలన్నింటిలో పాల్గొంటారు. అవసరమైనపుడు సైనికులుగా యుద్ధం చేస్తారు. వీరు విష్ లేదా వైశ్య వర్ణంగా ఏర్పడ్డారు. మలివేదయుగం చివరలో వీరిలో కొందరు వ్యాపార వృత్తిని చేపట్టారు. వర్తక శ్రేణులుగా స్థిరపడ్డారు.

అన్నిటికంటె ఆసక్తిదాయక అంశం నాల్గవది : శూద్రవర్ణం. శూద్రులెవరు? ఆర్యులా? ఆర్యుల పూర్వీకులా? స్థానిక అనార్యులా? భారత ఉపఖండంలో వారి స్థానమేమిటి? జవాబు జటిలమే. భిన్నాభిప్రాయాలున్నాయి.

క్రీ.పూ. 2000–1000 మధ్య రుగ్వేదకాలం చివరిదశలో వాయువ్య భారతం గుండా అనేక విదేశీ తెగలు దండెత్తి వచ్చాయి. అలా చొచ్చుకు వచ్చిన విదేశీ తెగలలో 'శూద్ర' తెగ ఒకటై వుండొచ్చునని ఆర్.ఎస్. శర్మగారి అభిప్రాయం.

శూద్రులనే తెగ 'అభీరు' అనే యాదవులతో వాయువ్య భారతంలో సరస్వతీనది ఒడ్డున కలిసి వుండేదని మహాభారతంలో చెప్పబడింది. 'అభీర' అనే మాండలికం 'ఆర్యభాషా' సంతతికి చెందినది. కనుక శూద్ర తెగకి ఆ భాషతో పరిచయం వుండి వుంటుంది. వేదయుగంలోని శూద్రులు ఆర్యభాషను అర్థం జేసుకోగల్గి వుంటారు. ఆర్యుల పూర్వీకుల జాబితాలో ద్రవిడులు, పుళిందులు, శబరులున్నారుగాని శూద్రుల ప్రస్తావన లేదు. అధర్వణ వేదంలో ఆ పదం మూడు సార్లు వచ్చింది.

శూద్రులు నివసించిన సరస్వతీ నదీపరివాహక ప్రాంతంలో బూడిదరంగు మట్టి పాత్రలు అత్యధికంగా లభించాయి. అది ఆనాటి జనావాసాలను సూచిస్తున్నాయి. వేదకాలంలో శూద్రులు ఆర్యుల చేతిలో ఓడిపోయారు. శూద్రతెగలు నాల్గవ వర్ణంగా పరిగణింపబడింది. అక్కడ నుండి ఆర్యుల చేత ఓడింపబడి, పశువుల్ని, భూముల్ని కోల్పోయి, అత్యంత హీన స్థితికి దిగజార్చబడినవారంతా ఈ శూద్రవర్ణంలోకి నెట్టబడినారు. వారిలో స్థానిక ప్రజలు, దాసులు, దస్యులు వున్నారు. వీరిని ఆర్యులు శూద్రులుగా, బానిసలుగా చూశారు.

యజ్ఞయాగాదులలో, యుద్ధాలలో బ్రాహ్మణులకు, క్షత్రియ వీరులకి వైశ్యులు కానుకలు సమర్పించేవారు. మొదట ఇష్టపూర్వకంగా, తర్వాత బలవంతంగా. బార్లీ, వరి, గోధుమ తృణధాన్యాలను యిచ్చేవారు. ఈ కానుకలలో స్త్రీ బానిసలు కూడ వుండేవారు. యుద్ధాలలో దోచినది ఎక్కువభాగం యుద్ధవీరులే తీసుకొనేవారు. ఇది సామాజిక అంతరాలకు దారితీసింది.

వర్ణ వివక్ష

రుగ్వేద కాలంలో తెగల వ్యవస్థ వుండేది. మలివేదయుగంలో శ్రమ విభజన ప్రాతిపదికపై బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర చాతుర్వర్ణ వ్యవస్థ ఏర్పడింది. బ్రాహ్మణ, క్షత్రియులు శారీరక శ్రమకి, ఉత్పత్తి కార్యకలాపాలకి దూరం. యుద్ధాలలో రాజుల విజయం కోసం బ్రాహ్మణులు యజ్ఞయాగాదులు చేస్తారు. జంతు బలులనిస్తారు. రాజులు బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని గుర్తిస్తారు. గో, వస్త్ర, కనక, అశ్విక దానాలతో సత్కరిస్తారు. ఉత్పత్తిని, ఆదాయాన్ని సృష్టించేది వైశ్యులు. పై మూడు వర్ణాలకి సేవలు చేసేది శూద్రులు.

క్రీ.పూ. 600లో ఇనుప పనిముట్లు వ్యవసాయంలోకి ప్రవేశించాయి. మధ్య గంగానదీ పరివాహక ప్రాంత సామాజిక, ఆర్థిక, రాజకీయ రూపురేఖలు సమూలంగా మారిపోయాయి. అరణ్యాలు మైదానాలుగా, పంటభూములుగా అభివృద్ధి చెందాయి. వైశ్యుల, శూద్రుల శ్రమతో అదనపు ఉత్పత్తి సృష్టించబడింది. ఈ అదనపు ఉత్పత్తిని బ్రాహ్మణ, క్షత్రియులకి జేరవేయాలి. రాజ్యాంగ యంత్రం అవసరమైంది. మహాజనపదాలుగా 16 రాజ్య వ్యవస్థలు ఏర్పడినాయి. ఈ వ్యవస్థను నడపటానికి సైన్యం, మంత్రులు, ఉద్యోగులు కావాలి. వారిని పోషించటానికి పన్నుల వ్యవస్థను నెలకొల్పారు.

వైశ్యుల, శూద్రుల శ్రమ ఫలితంపైనే ఆనాటి సమాజం సజావుగా సాగింది. ఇలాంటివారితో బ్రాహ్మణ, క్షత్రియులకు ఎప్పటికైనా ప్రమాదమే. ఇద్దర్నీ విడదీయాలి. లొంగదీయాలి. అందుకు బల ప్రయోగం ఒక్కటే చాలదు. మనసావాచా వారిని బానిసలను చేయాలి. అందుకు తగిన భావజాలాన్ని నూరిపోయాలి. బ్రాహ్మణులు బోధకులు. వేదాలను ఔపోసన పట్టారు. మత కర్మకాండలను ప్రవేశపెట్టారు. వైశ్యులను కూడ ఆ కర్మలలోకి దింపారు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్ణాలను 'ద్విజు'లన్నారు. జంధ్యం వేశారు. వేదాలను వినిపించారు. దీని వలన వైశ్యుల నుండి బ్రాహ్మణులు దానం, దక్షిణం పొందారు. శూద్రులను ఉపనయనానికి, చదువుకు దూరం చేశారు. సమాజం పౌరులుగా, పౌరులు కానివారుగా చీలిపోయింది.

ఉత్తర భారతంలోని గంగా, యమునా నదీ తీరాలలో రెండవ పట్టణీకరణ జరిగింది. నగరాలు వెలిశాయి. పాటలీపుత్రం కేంద్రంగా రవాణా మార్గాలు తెరుచుకున్నాయి. వ్యాపారం వికసించింది. నగరాలలో వ్యాపారులు గిల్డులుగా ఏర్పడ్డారు. వైశ్యుల పేరుతోనే వర్తక వర్గం స్థిరపడింది. సరుకులపై పన్నులు వేసి క్షత్రియ పాలకులు ఖజానా నింపుకున్నారు. ఇది ఇనుము తెచ్చిన విప్లవం. ఉత్పత్తిని పలు రెట్లు పెంచింది. వర్ణానికి బలమైన ఆర్థిక పునాది ఏర్పడింది. వర్ణానికి వర్గం తోడైంది.

పాలన క్షత్రియులది. పెత్తనం బ్రాహ్మణులది. పన్నులు వైశ్యులవి. వెట్టిచాకిరీ శూద్రులది. ఇనుముయుగంలో సామాజిక వైరుధ్యాలు తీవ్రతరమైనాయి. పాలకవర్గాలయిన క్షత్రియులకు, బ్రాహ్మణులకు మధ్య ఆధిపత్యం అంతర్గత పోరు ముదిరింది. బ్రాహ్మణులకు పన్నులు లేవు. ప్రత్యేక హక్కులు, ప్రత్యేక సౌకర్యాలపై క్షత్రియులు, పన్నులు కడుతున్నా ద్వితీయ పౌరులుగా వున్నామని వైశ్యులు, ఆర్థికంగా బలోపేతమైనా, ఖజానా నింపుతున్నా తమకు తగిన రక్షణ లేదని వ్యాపారులు, ఎంత శ్రమించినా తమ జీవన విధానం బానిసస్థాయిని దాటలేదని శూద్రులు తీవ్ర అసంతృప్తిగా వున్నారు. అదనుకోసం వేచి వున్నారు.

సమాజం క్రాస్ రోడ్స్‌కి జేరింది.

పాత వైదిక సమాజం ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి గుదిబండ అయింది.

ఇనుము యుగంలో వ్యవసాయం ప్రధాన ఉత్పత్తి శక్తి. వ్యవసాయం వల్లనే చేతివృత్తులు, వ్యాపారం వర్ధిల్లుతాయి. వ్యవసాయానికి పశువులు తోడుగా వుండాలి. వైదిక బ్రాహ్మణుల యజ్ఞయాగాలు, జంతుబలులు వ్యవసాయాభివృద్ధికి ఆటంకంగా వున్నాయి.

చిన్న చిన్న రాజ్యాలు, సరిహద్దులు, విభిన్న ఆచార, సంప్రదాయాలు వ్యాపారాభివృద్ధికి అడ్డంకి. ఒకే రాజ్యం, ఒకే మతం, ఒకే సిద్ధాంతం కావాలి. పెద్ద బలమైన జనపదాలు, చిన్నవాటిని కబళించి వేశాయి. చివరికి మగధ సామ్రాజ్యం ఏర్పడింది.

పాత వైదిక బ్రాహ్మణ భావజాలానికి పోటీగా ఒక కొత్త భావజాలం అవసరమైంది. జైన, బౌద్ధమతాలు ఆవిర్భవించాయి.

బౌద్ధయుగంలో వర్ణవ్యవస్థ

వైదికయుగం పశుపోషక సమాజం, వ్యవసాయక సమాజంలోకి మారుతున్నకాలంలో బౌద్ధమతం పుట్టింది. యజ్ఞయాగాదులలో జంతు బలులు వ్యవసాయాభివృద్ధికి అడ్డంకిగావున్నది. బుద్ధుడి అహింసా సిద్ధాంతం జంతు బలులకు వ్యతిరేకం. వ్యవసాయానికి, పశుపోషణకి అనుకూలంగా వుంది. వ్యవసాయం అభివృద్ధి చెందితేనే రాజులకు పన్నులు, వ్యాపారులకు ఆదాయం వస్తుంది.

క్షత్రియ పాలకులు, వ్యాపారులు బౌద్ధమతాన్ని స్వాగతించారు. ఆరామాలు కట్టించారు. భూరివిరాళాలు యిచ్చారు. రాజమతంగా ప్రకటించారు. అశోకుడు బౌద్ధమతం పుచ్చుకున్నాడు.

రాజమతంగా ఎదిగినా బౌద్ధమతం వర్ణవ్యవస్థను కదిలించలేకపోయింది. బ్రాహ్మణ భావజాలాన్ని తుదముట్టించలేకపోయింది. బౌద్ధమతం వర్గపునాదే ఇందుకు కారణం. రాజరిక, వ్యాపార వర్గ ప్రయోజనాలను కాపాడింది. ఖచ్చితమైన బ్రాహ్మణ వ్యతిరేక భావజాలాన్ని ప్రకటించ లేకపోయింది. వర్ణంపై ఊగిసలాడింది. బౌద్ధసంఘాలలోకి అందరూ జేరవచ్చునని బుద్ధుడన్నాడు గాని వర్ణవ్యవస్థ రద్దు కావాలనలేదు. శూద్రవర్ణంతో సమావేశమైన దాఖలాలు లేవు.

బౌద్ధయుగంలోనే న్యాయవ్యవస్థ ప్రారంభమైంది. వర్ణ ప్రాతిపదికన సివిల్, క్రిమినల్ కోడ్ చట్టాలను ఏర్పాటుచేశారు. ఒకే తప్పుకి అగ్రవర్ణాలకి శిక్ష తక్కువ. శూద్రవర్ణానికి శిక్ష ఎక్కువ. రాజరికం విధించిన ఈ శిక్షలను బుద్ధుడు వ్యతిరేకించలేదు. వడ్డీ వ్యాపారాన్ని బుద్ధుడు సమర్ధించాడు. అప్పులు తీర్చిన తర్వాతనే బానిసలను సంఘంలోకి అనుమతించాలన్నాడు. నిజానికి వేదానంతర కాలంలోనే, బుద్ధుని కాలంలోనే, వర్ణవ్యవస్థ, రాజ్యవ్యవస్థ దృఢంగా వేళ్లూనింది. అదనపు ఉత్పత్తి పాలకవర్గాలకి ముమ్మరంగా జేరవేయబడింది. క్షత్రియుల అవసరమేరకే బౌద్ధం బ్రాహ్మణ్యాన్ని వ్యతిరేకించింది. పాలకులకి, వ్యాపారులకి పనిముట్టుగానే మిగిలిపోయింది.

బుద్ధుడిది అహింసా సిద్ధాంతం. భావ, భౌతికవాదాలలో బుద్ధుడు తనది మధ్యేమార్గం అన్నాడు. చార్వాకాన్ని దూరం పెట్టాడు. దుఃఖానికి మూలం కోరిక. కోరికలను త్యజించటమే నిర్వాణం. మనస్సే అన్నిటికి మూలం అంటూ సమాజాన్ని ప్రక్కన పెట్టాడు. కర్మ, పునర్జన్మల విషయంలో ఉపనిషత్తులతో రాజీ పడ్డాడు. ఆత్మస్థానంలో చైతన్యాన్ని ప్రవేశపెట్టి కర్మలను బట్టి అదే పునర్జన్మను నిర్ణయిస్తున్నదన్నాడు. ఇది బ్రాహ్మణులకి వజ్రాయుధ మయింది.

వైదిక భావజాలం హిందూమతంగా పునరుజ్జీవనం

క్రీ.పూ. 200 – క్రీ.శ. 200 కాలంలో మౌర్య సామ్రాజ్యం పతనం, బ్రాహ్మణులైన శుంగ, కణ్వ, శాతవాహన రాజులు అధికారంలోకి రావటం జరిగింది. మౌర్యపాలనలో యజ్ఞయాగాదులు, జంతుబలులు తగ్గి ఆదాయం తగ్గటంతో బ్రాహ్మణులు బౌద్ధమతంపై తీవ్ర శత్రుత్వం పెంచుకున్నారు. ఎంత తటస్థ వైఖరి నవలంబించినా వారు బౌద్ధులను వదిలిపెట్టలేదు. నిద్రాణంగా పడివున్న వేయి పడగల వైదిక పాము మళ్లీ పడగ విప్పి బుసలు కొట్టింది. ఇదే కాలంలో ఇండో

గ్రీకులు దండెత్తి వచ్చారు. శకులు, పార్థియన్లు, కుషానులు, హూణులు వాయువ్య, ఉత్తర భారతంలో రాజ్యాలను స్థాపించారు. సాంస్కృతిక పునాదులు లేని ఈ చిన్నా, చితకా విదేశీ రాజులు తమ అస్తిత్వాన్ని కోల్పోయి భారతీయులైపోయారు. యుద్ధవీరులైన వీరిని బ్రాహ్మణులు పెద్ద సంఖ్యలో క్షత్రియులుగా జేర్చుకున్నారు.

బౌద్ధమతం గత ప్రాభవాన్ని కోల్పోయింది. మహాయానం, హీనయానంగా చీలిపోయింది. బౌద్ధ భిక్షువులలో కొత్త తరాలు ధన సంపాదనకి, సుఖ జీవితానికి అలవాటుపడ్డారు. రాజరిక ఆదరణ తగ్గిపోయింది. బౌద్ధ సిద్ధాంతాన్ని నీరుగార్చారు. చివరికి విగ్రహారాధన వద్దన్న బుద్ధుడి విగ్రహాన్ని ఆరాధించారు.

ఇనుము యుగంలో ఉత్పత్తి శక్తులు శరవేగంగా పురోగమించి అడవులను పంటభూములుగా మార్చే వ్యవసాయ కార్యక్రమం చురుకుగా సాగింది. ఈ మార్పులను ఎవరూ ఆపలేరు. యజ్ఞయాగాదులు, జంతుబలులు చుట్టూ తిరిగే వైదికమతం భవిష్యత్ సమాజానికి ఇంకెంతమాత్రమూ సరిపోదు. ఇది మారాలి. అదే సమయంలో వర్ణవ్యవస్థని, బ్రాహ్మణ భావజాలాన్ని కాపాడాలి. ఎలా? పాము కుబుసం విడిచినట్లు వైదికమతం కొత్తరూపు దాల్చింది. హిందూమత దేవుళ్ళు, విశ్వాసాలు ఆవిర్భవించాయి.

బ్రాహ్మణిజం సంస్కరింపబడింది. గోవధనే కాదు, అసలు జంతు హింసే కూడదన్నారు. వైదికమతం దేవుడైన ఇంద్రుడిని వెనక్కి నెట్టారు. సృష్టి, స్థితి, లయలకు మూలమైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను ముందుకు తెచ్చారు. స్థితికారుడైన విష్ణువుకు పెద్దపీట వేశారు. విష్ణువుకు సహస్ర రూపాలనిచ్చారు. మహాభారతంలో కృష్ణుడిని జేర్చారు. నరుడే నారాయణుడన్నారు. ప్రతి జీవిలోను ఆత్మ వుంది. ఆత్మ పరమాత్మలో లీనమగుటయే మోక్షం అన్నారు. భక్తి, ఆరాధనలతో భగవంతుడిని వశం చేసుకోవాలన్నారు. బియ్యం, నువ్వులు, పప్పు, బెల్లం, ఫలం, పుష్పం తదితర వ్యవసాయ ఉత్పత్తులను నైవేద్యంగా సమర్పించాలన్నారు.

గుప్తుల కాలం బ్రాహ్మణులకి స్వర్ణయుగం. మంత్రుల నుండి ఉన్నతోద్యోగుల వరకు అంతా వారే. పెద్ద పెద్ద జీతాలను ధనరూపంలో పొందేవారు. రుణాలపై వడ్డీలలో కూడ వర్ణ విచక్షణ చూపారు. బ్రాహ్మణులకి 2 శాతం, క్షత్రియులకు 3 శాతం, వైశ్యులకు 4 శాతం, శూద్రులకు 5 శాతం వడ్డీ విధించారు.

క్రీ.పూ. 3-4 శతాబ్దాలలో గుప్తుల కాలంలో తీవ్ర ఆర్థిక సంక్షోభం తలెత్తింది. ఉత్పత్తిని సృష్టించే వైశ్యులు, శూద్రులు పంపిణీలోని అసమానతలను తీవ్రంగా ప్రతిఘటించారు. మన దేశంలో వర్గ, వర్ణ పోరాటాలపై సరైన, సమగ్ర చారిత్రక సమాచారం లేదు. బ్రాహ్మణులు, క్షత్రియులు ఒకరినొకరు తోడుగా వుండాలి. వైశ్యులు, శూద్రులు తమ విధుల నుండి వైదొలగితే ప్రపంచం అల్లకల్లోలితమవుతుందని మనువు రాశాడంటే ఆనాటి పరిస్థితులను ఊహించుకోవచ్చు.

ఖజానా ఖాళీ అయింది. గుప్తులు ద్రవ్యరూపంలో బ్రాహ్మణులకి, ఉన్నతోద్యోగులకి బహుమతులు, జీతాలు యివ్వలేని పరిస్థితి నెలకొంది. అటవీ ప్రాంతాలు, వెనుకబడిన

గ్రామాలలోని బంజరు భూముల్ని దానం చేయసాగారు. తెలివిగా బ్రాహ్మణులు తమ దానాలపై చట్టబద్ధతని తెచ్చుకున్నారు. ఆ భూములున్న ప్రాంతాలపై సర్వ హక్కులు వారివే. దీనివలన ప్రభుత్వ నిర్వహణ ఖర్చులు, శాంతిభద్రతలు సమస్య కొంతవరకు తగ్గింది. దానాలు పొందిన బ్రాహ్మణులు భూస్వాములయ్యారు. స్థానికంగా తమ అధీనంలోని ప్రాంతాలపై అధికారం సంపాదించారు. ఇది భారత ఉపఖండంలో భూస్వామ్య వ్యవస్థకి బీజం వేసిందని ఆర్.ఎస్. శర్మ అభిప్రాయం.

అటవీ, బంజరు భూముల్ని సాగుచేయటం బ్రాహ్మణులకు కాని పని. ఆటవిక గిరిజనుల్ని వేట, ఆహార సేకరణ నుండి వ్యవసాయంలోకి తీసుకురావాలి. ఇది అతి క్లిష్టమైన సమస్య. ఈ సమస్యను బుద్ధుడి అహింసా సిద్ధాంతమే కొంత పరిష్కరించింది.

కళింగ యుద్ధంలో అశోకుడు అతికష్టంగా గెలిచాడు. యుద్ధంలో సాధించినదానికంటే పోగొట్టుకున్నది ఎక్కువ. ఒక గణతంత్ర రాజ్యాన్ని గెలవటం ఎంత కష్టమో, అక్కడి ప్రజలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలపై ఎంత మక్కువో మొదటిసారి తెలిసి వచ్చింది. ఆటవిక తెగలను వ్యవసాయక తెగలుగా మార్చడం ఖజానాకు అవసరమేగాని, అది ఆచరణలో అంత సులువు కాదు. బుద్ధుడి అహింసా సిద్ధాంతమే అందుకు మార్గం. ఆటవికులకి బుద్ధుడి అహింసా సిద్ధాంతాన్ని బోధించారు. కొన్ని పక్షి జాతులను, చేపల వేటను కూడ నిషేధించారు. నయాన, భయాన గిరిజన తెగల్ని వ్యవసాయంలోకి తెచ్చారు. ఇదే మార్గాన్ని బ్రాహ్మణులు అనుసరించారు.

ఆటవికులకి హిందూ దేవుళ్లను పరిచయం చేశారు. గిరిజన దేవతలను హిందూ ఆచార, సంప్రదాయాలతో పూజలు, ధూప, దీప, నైవేద్యాలతో ఆహ్వానించారు. అమ్మవార్లకు అగ్రవర్ణాల వీధులలో చోటు దొరికింది. అంతటితో ఆగలేదు. హిందూ దేవుళ్ళకు గిరిజన దేవతలకు ముడిపెట్టారు. కృష్ణుడికి జాంబవతిని, నర్సింహస్వామికి చెంచులక్ష్మిని, శివుడికి గంగమ్మను, వెంకటేశ్వరుడికి బీబీనాంచారమ్మను యిచ్చి పెళ్ళిళ్ళు చేశారు. అటవీ భూములలోనికి ఇనుప కర్రు నాగలిని ప్రవేశపెట్టారు. ఋతుపవనాలు, పంచాంగం, తిథి, నక్షత్రాలు ప్రాధాన్యతను చెప్పారు. మంచి ముహూర్తాలు చూసి అడవుల్ని నరికి దున్నించారు. పంటల్ని తమ ఇళ్లకు జేరవేయించారు. గిరిజన పండుగల్ని వ్యవసాయ పండుగలుగా ఘనంగా జరిపించారు. ఈ పని చేయటానికి గ్రీస్, రోమ్‌లలో రక్తం పారింది. అదే పనిని మన ఉపఖండంలో సాంస్కృతిక మార్పుతో మానసికంగా బానిసలను చేసి సాధించారు. మారనివారిని బలవంతంగా లొంగదీసుకున్నారు. నాగులు అలాంటివారే. వారిని అణచివేసినందకు వారి చిహ్నంగా వున్న నాగబామును విష్ణువు పాన్పుగా చేశారు. ఇలాంటి ఉదాహరణలెన్నో కొశాంబి చెప్పారు.

ఇప్పుడో కొత్త సమస్య వచ్చింది. ఇంతవరకు వర్ణవ్యవస్థ కొనసాగింది. ఇందులో నాలుగు వర్ణాలున్నాయి. కొత్తగా అసంఖ్యాకమైన గిరిజన తెగలు హిందూ సమాజంలోకి లాగబడినాయి. వీరిది ఏ వర్ణం? వ్యవసాయ సమాజంలో ఉత్పత్తి శక్తులు అభివృద్ధి చెందటంతో ఎన్నో నూతన వృత్తులు పుట్టుకొస్తున్నాయి. వీరిని ఏ వర్ణంలోకి జేర్చాలి? ఇప్పటికీ విదేశీ పాలకుల్ని క్షత్రియ వర్ణంలోకి జేర్చారు. వర్ణ సంకరం కొత్తగాదు, ఆశ్చర్యం కాదు.

వర్ణం - కులం

వర్ణం విస్తృతమైంది. కులంగా రూపాంతరం చెందింది. వర్ణం, కులం వేరుగాదు. వర్ణం కొనసాగింపే కులం.

ఒకే వృత్తి గల కుటుంబాల జనాభా రానురాను పెరిగిపోయింది. ఈ పెద్ద సమూహాలను హిందీలో 'జాతి', తెలుగులో 'కులం' అంటారు. ఇంగ్లీష్‌లో caste అంటారు. నిజానికి caste పోర్చుగీస్ పదం. Casta/ race అంటే తెగ అని అర్థం.

మెగస్తనీస్ తన కాలంలోని ఏడు వృత్తులు గురించి చెప్పాడు. కులం అనే పేరు వాడలేదు. మనుస్మృతిలో 61 కులాలు, బ్రహ్మవైవర్త పురాణంలో 100కు పైగా కులాలు వున్నాయి. గుప్తుల కాలంలో కులాల సంఖ్య భారీగా పెరిగింది. బ్రాహ్మణులు వీటిని వర్ణ సంకర కులాలు అన్నారు. బౌద్ధం ఆవిర్భవించిన నాటి నుండి గుప్తుల యుగం (క్రీ.పూ. 500 - క్రీ.శ. 500) వరకు మధ్య కాలాన్ని భారతీయ కులవ్యవస్థ దానిని బలపరిచే 'భావజాలం' రూపొందిన కాలమని చెప్పవచ్చు. (ఇర్ఫన్ హబీబ్)

గుప్తుల కాలంలో బ్రాహ్మణులకు భూదానాల తర్వాత వ్యవసాయం అటవీ ప్రాంతాలకు ప్రాకింది. గిరిజన తెగల్ని హిందూ మతంలోకి దింపి కులాల ఊబిలోనికి నెట్టారు. ఒక్కో తెగ ఒక్కో కులంగా మారిందన్నాడు ఆర్.ఎస్. శర్మ. ఆయన విద్యార్థిని సువిరా జైస్వాల్ మరింత వివరణ యిస్తూ తెగలు మొత్తంగా కులాలుగా మారలేదు. తెగలలో విభిన్న వృత్తులవారు విభిన్న కులాలుగా ఏర్పడ్డారని అన్నారు. తెగ నాయకులకి, యుద్ధవీరులకి ఉన్నత వంశనామాన్ని ప్రసాదించి క్షత్రియ, బ్రాహ్మణ కులాలలోకి మార్చారు. మహాభారతంలో ద్రోణాచార్యులు అలాంటివాడేనంటారు. సూతపుత్రుడైన కర్ణుడికి అంగరాజ్యాన్ని యిచ్చి క్షత్రియుడ్ని చేశారు. ఈనాడు సాంఘికంగా వెనుకబడిన శూద్ర కులాలలో అత్యధికులు ఒకనాడు గిరిజన తెగలకి చెందినవారే. ఎరుక, యానాది, బెస్త, అగ్నికుల క్షత్రియ, గౌడ తదితర కులాలు అలాంటివే.

తొలి వేదకాలంలో లేని అనేక అడ్డంకులు కులాల మధ్య చోటు చేసుకున్నాయి. ఆనాడు వృత్తుల మధ్య ఖచ్చితమైన విభజన లేదు. చేతివృత్తులు వంశపారంపర్యంగా కొనసాగడం ఆనవాయితీగా అన్ని దేశాలలోనూ వుంది. కులవ్యవస్థలో దానిని అనివార్యం చేశారు. ఎవరి కులవృత్తి వారు ఆచరించి తీరాలన్నారు. కులాల దొంతరలను, క్రింది కులాల శ్రమదోపిడీని పై కులాలకు జేరటాన్ని కాపాడటానికే కులవృత్తిని కులధర్మంగా చెప్పారు.

ఏ కులంవారు ఆ కులంవారినే పెళ్ళాడాలి. ఇది కులాల మధ్య అడ్డుగోడలను శాశ్వతం చేసింది. పై కులంవారు క్రింది కులంవారిని పెళ్ళాడటానికి, సాంఘికబంధాలకి తలుపులు మూసివేయబడినాయి. వర్ణవ్యవస్థలో ఇంత ఖచ్చితమైన నిబంధనలు లేవు. అర్జునుడు యాదవ వంశానికి చెందిన సుభద్రను, భీముడు ఆటవిక స్త్రీ అయిన హిడింబిను, శంతనుడు మత్స్యకన్యను పెళ్ళాడతారు. వర్ణాల మధ్యకంటే కులాల మధ్య అంతరం ఎక్కువైంది. కారణాలనేకం చెబుతారు.

చాతుర్వర్ణ వ్యవస్థ బహు కులాల సంకటిగా మారింది. గిరిజన తెగల్ని కులాలలోకి నెట్టినా, వారి ఆచార సంప్రదాయాలు సమసిపోలేదు. సాధారణంగా ఒక తెగ మరొక తెగవారిని పెళ్ళాడరు.

వర్ణాలలో గోత్రాలున్నాయి. సగోత్రీకుల మధ్య పెళ్లిళ్లు లేవు. తెగలు, వర్ణాలు కులాలుగా మారిన తర్వాత కూడ ఈ నిషేధాలు, ఆచార, సంప్రదాయాలు కొనసాగాయి. పైగా కులాల మధ్య సామాజికంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా పెద్ద, చిన్న తారతమ్యాలు (stratification) ఏర్పడినాయి. ఇవి వర్ణవ్యవస్థలోనే ప్రారంభమైనాయి.

ఏ కులానికాకులం తమ 'స్వచ్ఛత', 'పవిత్రత'పై భయం పెంచుకున్నాయి. అగ్రకులాలలో, ముఖ్యంగా బ్రాహ్మణులలో ఇది మరింత ఎక్కువైంది. వివాహంలో సంకరం పెనుభూతమైంది. కులాల స్థాయి నిచ్చెనమెట్ల వలె వుండటం వలన ప్రతి కులానికి 'పై' కులం వుంటుంది. 'క్రింది' కులం వుంటుంది. కులాలు దేనికదే విడిపోయి water tight compartments గా మారిపోయాయి.

క్రీ.పూ. 6వ శతాబ్దం గుప్తులు కాలం ఆ తర్వాత కూడ భూదానాలు జరిగి భూస్వామ్య వ్యవస్థకు పునాది పడింది. సాగుదార్లకి, భూస్వాములకి మధ్య కౌల్దారులు వచ్చారు. వీరు భూస్వాములకి కౌలు చెల్లిస్తారు. ఈ కౌల్దారీ వ్యవస్థ మొదట బెంగాల్, ఒరిస్సాలలో ఏర్పడి క్రమంగా ఉత్తర భారతానికి ప్రాకింది. కౌల్దార్లు, రైతులు సాగుభూములు వదలి వెళ్ళరాదని శాసనాలు చేశారు. భూస్వాముల ఆదాయాల్ని కాపాడటానికిది అవసరమైంది. రైతు గ్రామానికి, సాగుభూమికి కట్టివేయబడ్డాడు. ఇదే కాలంలో వ్యాపారం తగ్గుముఖం పట్టింది. అంతకుముందే విదేశీ వాణిజ్యం మూతపడింది. పట్టణాలు శిథిలమైనాయి. రవాణా ఆగిపోయింది. వ్యాపారులు, చేనేతవారు, రైతులు ఎక్కడివారు అక్కడే బందీలయ్యారు. స్థానిక అవసరాలు స్థానికంగానే తీర్చాల్సిన అవసరం ఏర్పడింది. ప్రతి ప్రాంతంలోనూ వృత్తులువారీగా సొంత ఆచారాలు, కట్టుబాట్లతో సమూహాలు ఏర్పడినాయి. తిండి, పెళ్లిలో కూడ వేరువేరు సంప్రదాయాలు ఆచరణలోకొచ్చి కాలక్రమంలో ఈ సమూహాలు వృత్తులవారీ కులాలుగా స్థిరపడినాయి.

జాతి, ప్రాంతం ప్రాతిపదికగా ఒకే వర్ణంలో అనేక కులాలు పుట్టాయి. ఒక్క తెలుగు రాష్ట్రాలలోనే వ్యవసాయ కులాలుగా రెడ్లు, కాపులు, కమ్మలు వున్నారు. కల్లుతీత వృత్తిగా గౌడ, శెట్టిబలిజలున్నారు. నేత వృత్తిగా సాలి, దేవాంగులున్నారు. ఉత్తర భారతంలో వ్యవసాయ కులాలుగా జాట్‌లు, తమిళనాడులో చెట్టియార్‌లు, గుజరాత్‌లో పటేల్‌లు వున్నారు.

వర్ణవ్యవస్థలోని కులాలను 'సవర్ణు'లంటారు. ఈ వ్యవస్థకి వెలుపలివారిని 'అవర్ణు'లంటారు. వీరిని అస్పృశ్యులు, అంటరానివారు, పంచములు అని కూడా అంటారు. వీరు చేసే పనులను అశుద్ధపు పనులంటారు. అవి చేయకుంటే సమాజం స్తంభించిపోతుంది. అయినా వారిని ఊరికి దూరంగా నెట్టారు. నికృష్టంగా చూశారు. నిస్సహాయతకు గురిచేశారు. మానవత్వాన్ని మంటగలిపారు. పారిశుధ్యంలో సాంకేతికత పెరిగినా వారి పరిస్థితి మాత్రం ఈనాటికీ మారలేదు.

గణవ్యవస్థలో తెగ పెద్దగా వుండే 'రాజు' కూడ కాయకష్టం చేసేవాడు. వేదకాలంలో తోలుపని అశుద్ధం కాదు. అదనపు ఉత్పత్తి పాలకవర్గాలకి జేరిన తర్వాత శారీరక శ్రమ నుండి మానసిక శ్రమ వేరైంది. బ్రాహ్మణులు, క్షత్రియులు శారీరక శ్రమకి దూరమయ్యారు. శ్రమించటాన్ని న్యూనతగా చూడసాగారు. జంతు కళేబరాలను ఒలవటం, తోలుపని, శవదహనం,

లేదా ఖననం, పారిశుద్ధ్య పనులు నీచంగా చూడబడినాయి. క్రీ.పూ. 5వ శతాబ్దం నుండి ఇది ప్రారంభమైంది. మొదట అస్పృశ్యులను 'చండాలురు' అనేవారు. సాంస్కృతికంగా, సామాజికంగా వెనుకబడిన గిరిజన తెగల్ని, యుద్ధాలలో ఓడిన బానిసల్ని, సాంఘిక బహిష్కరణకు గురైనవారిని అంటరానివారుగా, చండాలురుగా పరిగణించారు. మనుస్మృతిలో సంకర జాతులు అంటే అవర్ణులు. వీరు సైంద్రవులు – జంతువుల్ని వేటాడేవారు. నైవర్తులు – పడవలవాళ్లు, నిషాదులు – చేపలు పట్టేవాళ్లు, తోలుపనివారు తదితరులు.

హిందూ సమాజం కులాలుగా, ఉపకులాలుగా చీలిపోయింది. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు (వర్తక శ్రేష్ఠులు) అగ్రకులాలుగా వున్నారు. వీరిది విశ్రాంతివర్గం. ఉత్పత్తి కార్యకలాపాలతో ప్రత్యక్ష సంబంధం లేదు. శూద్రులు బహుజనులు. శారీరక శ్రమ చేసేది, అదనపు ఉత్పత్తిని సృష్టించేది వీరే. ఇక అంటరాని కులాల్ని అందరూ బయటకు నెట్టేశారు. వీరి వెట్టిచాకిరీతోనే సమాజం పరిశుభ్రమవుతోంది.

కులం భావజాలం

హిందూమతం అంటే కులం. కులం అంటే హిందూమతం. హిందూ మతానికి కులం పర్యాయపదమైంది. కులం ఒక సామాజిక దొంతరుల రూపం (a form of social stratification). ఈ రూపం ఇలాగే కొనసాగాలంటే దానికి చట్టబద్ధత కల్పించాలి. అది న్యాయంగా కనిపించాలి. అందుకు తగిన భావజాలాన్ని రూపొందించాలి. కులం పుట్టుకతోనే వస్తుందని, గతజన్మల కర్మల ఫలమని, ఈ జన్మలో ఎవరి కులధర్మాన్ని వారు ఆచరించాలని, అప్పుడే మరుజన్మలో ఉత్తమ కులం ప్రాప్తిస్తుందని హిందూ ధర్మశాస్త్రాలు ప్రవచించాయి.

కులాన్ని సృష్టించిన బ్రహ్మ కులధర్మం ఎలా వుండాలో మనువుకు చెప్పాడు. అదే మనుస్మృతి. మనుస్మృతి క్రీ.పూ. 200 – క్రీ.శ. 300 కాలానికి చెందినది. ఒకవైపు విదేశీ తెగల రాజులు వాయువ్య ఉత్తర భారతంపై దండెత్తి చిన్న చిన్న రాజ్యాలను స్థాపించారు. స్వతంత్రంగా మనలేని ఆ విదేశీ తెగలు భారతీయ సంస్కృతిలో లీనమైపోయాయి. విదేశీ రాజులు క్షత్రియులుగా స్వీకరింపబడ్డారు. మరోవైపున ఆటవిక తెగలనేకం హిందూ కులాలలోకి లాగబడినాయి. వర్ణ సంక్రమణం బ్రాహ్మణ్యాన్ని ప్రమాదంలో పడవేసింది. అపుడు మనువు రూపంలో ధర్మ సంరక్షణకు ప్రయత్నం జరిగింది. వర్ణవ్యవస్థను, హిందూ ధర్మశాస్త్రాలను మనువు న్యాయపరంగా క్రోడీకరించాడు. భారత కులవ్యవస్థను మనుధర్మశాస్త్రం నిర్వచించి భాష్యం చెప్పింది.

వర్ణములలోకెల్ల బ్రాహ్మణుడు ప్రభువు. సర్వధనమునకు అర్హుడు. లోకంలో సర్వస్వమును బ్రాహ్మణుడిదే. బ్రాహ్మణుడు అగ్ని అంత పవిత్రుడు, దైవసమానుడు.

బ్రాహ్మణుని సంప్రదించకుండ యజ్ఞయాగాదులు చేసే పాలకులు నీచులు. క్షత్రియులు గాని రాజుల వద్ద కానుకలు గైకొనరాదు. విదేశీయులై క్షత్రియులుగా మారినవారు రెండవరకం వారు. నీచజన్మ, హీనమైన వంశం నుండి వచ్చిన వ్యక్తి రాజుగావటానికి అనర్హుడు.

ఉత్తమ వంశం, పాలనానుభవం గల బ్రాహ్మణులను మంత్రులుగా నియమించాలి. న్యాయాధిపతులుగా వారే వుండాలి. శూద్రుడు వ్యాజ్యాన్ని పరిష్కరిస్తే ఆ రాజ్యం వూబిలోపడ్డ ఆవులా దిగజారిపోతుంది. క్రిమినల్ చట్టంలో సాక్ష్యానికి శూద్రుడు అనర్హుడు. అగ్రవర్ణాలను బండ బూతులు తిట్టిన శూద్రుల నాలుక కోయాలి. వేదాలు వింటే, చెవిలో సీసం పోయాలి. కర్ర ఎత్తితే చేతిని, తన్నితే కాలును తీసివేయాలి. అగ్రకులంవాడి ప్రక్కన కూర్చుంటే నడుంకి వాత పెట్టాలి. శూద్రుడు బ్రాహ్మణుని చంపితే మరణశిక్ష, బ్రాహ్మణుడు శూద్రుని చంపితే పది ఆవులు, ఒక ఎద్దు జరిమానా. శూద్రుడికి సొంత ఆస్తి వుండరాదు. ఆయుధాలు ధరించకూడదు.

వైశ్యులు పన్ను కట్టాలి. బ్రాహ్మణులకు పన్నులు లేవు. వారి భూములపై చట్టాలు చెల్లవు. శూద్రులు నెలకి ఒక రోజు ప్రభుత్వానికి ఉచితంగా పనిచేయాలి. బ్రాహ్మణుల అప్పుపై 2 శాతం, శూద్రులపై 5 శాతం వడ్డీ. శూద్రులకు ఆస్తి హక్కు లేదు.

వివాహాలపై బ్రాహ్మణులకు మనుస్మృతి విశృంఖల స్వేచ్ఛనిచ్చింది. చివరికి పిల్లల పేర్లపై కూడ మనువు వర్ణ బేధాన్ని ప్రవేశపెట్టాడు.

మనుస్మృతి బ్రాహ్మణ భావజాల ఆధిపత్యానికి ఒక అస్త్రంగా మారింది. కౌటిల్యుడి అర్ధశాస్త్రం కులవ్యవస్థకి రాజముద్ర వేసింది. క్రీ.పూ. 4వ, క్రీ.శ. 3వ శతాబ్దానికి చెందిన ఈ గ్రంథం రాజ్యవ్యవస్థకు, వర్ణవ్యవస్థకు మార్గదర్శకాన్ని నిర్దేశించింది. సొంత ఆస్తి, వర్ణాశ్రమ ధర్మాల్ని కాపాడటమే కౌటిల్యుడి ఉద్దేశ్యం.

హిందూ ధర్మశాస్త్రాల సారాంశాన్ని సామాన్య ప్రజలకు జేరవేయాలి. రామాయణ, మహాభారత, భాగవతాల్ని కడు రమణీయంగా రచించి జనం గుండెల్లోకి జొప్పించారు. క్రీ.పూ. 5వ శతాబ్దంలో జానపదాలుగా ప్రారంభమైన ఈ కావ్యాలు క్రీ.శ. 12వ శతాబ్దానికి పరిపూర్ణమై ఉపఖండంలో ఇంటింటికీ జేరాయి. మహాభారతంలోని శాంతిపర్వం నాటి సామాజిక చింతనను విశదీకరిస్తుంది.

వర్ణాశ్రమ ధర్మాలు, సొంత ఆస్తి, పితృస్వామికం, రాజ్యవ్యవస్థ రూపురేఖలను సందర్భానుసారంగా ఈ పురాణాలలో జేర్చి హిందూ సంస్కృతిని జనం నరనరాన ఎక్కించారు.

శూద్రుడైన శంభూకుడు వేదాలు చదువుతున్నాడని, రాజ్యాన్ని వర్ణవ్యవస్థను వ్యతిరేకిస్తున్నాడని శ్రీరాముడు వధిస్తాడు. సూతపుత్రుడైన కర్ణుడిని పలుమార్లు అవమానిస్తారు. నీతికోవిదుడైన విదురుడు బానిస స్త్రీకి పుట్టినవాడని అగౌరవపరుస్తారు. యజ్ఞయాగాదులను వ్యతిరేకించే అనార్యులను రాక్షసులనే పేరుతో హింసిస్తారు. శూద్రులను, స్త్రీలను సమాజంలో అట్టడుగు స్థాయికి నెట్టారు.

హిందూ ధర్మానికి భగవద్గీత ఒక తాత్త్విక ముసుగు వేసింది. నాలుగు వర్ణాలను తానే సృష్టించానని, గుణ కర్మలను బట్టి వర్ణం నిర్ణయింపబడుతుందని శ్రీకృష్ణుడు చెబుతాడు. ఈ జన్మలో నీ కర్మని నీవు ప్రతిఫలాపేక్ష లేకుండా చేయాలి. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు తమ వర్ణ ధర్మాన్ని ఆచరించాలి. అప్పుడే ధర్మం నాలుగు పాదాల వర్ధిల్లుతుంది అని అర్జునుడికి బోధిస్తాడు.

కులం పరిణామం

Dynamics of Caste

కులం మార్పులేనిది, చలనరహితమైనదనే భావన ఒకటి వుంది. భారత ఉపఖండంలో కులం శిలాసదృశంగా ఘనీభవించిందని, ఇది ఇంతే, ఇక మారదని వారి అభిప్రాయం.

కులం సమాజానికతీతమైనది కాదు. అది కేవలం మనసులోని భావన కాదు. ఉత్పత్తి క్రమంలో ఒక భాగంకూడా. సామాజిక, ఆర్థిక మార్పులకనుగుణంగా అది మారింది. మారుతూవుంది. సాంస్కృతిక మార్పుల ప్రభావం దానిపై వుంది. విభిన్న చారిత్రకదశలలో విభిన్న రూపాలను సంతరించుకుంది.

ఋగ్వేదంలో తెగల వ్యవస్థలో లేని వర్ణం, మలివేదయుగంలో శ్రమవిభజనతో ప్రారంభమైంది. వర్ణం భారత ఉపఖండానికే ప్రత్యేకం. ఆర్యులు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులుగా విభజితమయ్యారు. వీరు ద్విజులు. జంధ్యం వేస్తారు. యజ్ఞాలు, యాగాలు చేస్తారు. వేదం పఠిస్తారు. ఇంద్రాది దేవుళ్లను ప్రార్థిస్తారు. అగ్నిని పవిత్రంగా భావిస్తారు. ఈ భాగ్యం శూద్రులకు లేదు. బాక్ట్రియా – మార్జియానా సంస్కృతితో సంపర్కంవున్న ఆర్య తెగలపై ఆ సంస్కృతి ప్రభావం వుంది. అక్కడి మత విశ్వాసాలు ఆర్య తెగలలో కొనసాగాయి. అదే వర్ణ వ్యవస్థలో బీజ రూపంలో ప్రతిబింబించింది. అందువల్ల ఆర్య బ్రాహ్మణ భావజాలం ఆకస్మికంగా, యాదృచ్ఛికంగా వచ్చిందికాదు.

వలస వచ్చిన ఆర్య సంస్కృతే వర్ణంలో చిచ్చు పెట్టింది. శూద్రులుగా ముద్రవేసిన అనార్యులను యుద్ధాలలో ఓడించటమేగాదు, సామాజికంగా దూరం పెట్టారు. యజ్ఞయాగాదులలో బ్రాహ్మణులకు దానాలు, యుద్ధ విజేతలైన క్షత్రియ వీరులకు 'బలి' లేదా బహుమతులు సమర్పిస్తారు. అందువలన వర్గ విభజనలు లేవుగాని సామాజిక అంతరాలు పొడసూపాయి. బ్రాహ్మణులు, క్షత్రియులు ఉత్పత్తిలో పాల్గొనరు. వైశ్యులు, శూద్రులు శారీరకశ్రమ చేస్తారు. ఇది మానసిక, శారీరకశ్రమల మధ్య, వర్ణాల మధ్య దూరాన్ని పెంచింది.

ఇనుము పనిముట్లు వ్యవసాయంలోకి ప్రవేశించిన తర్వాత 'అదనపు ఉత్పత్తి' సృష్టింపబడింది. వైశ్యుల, శూద్రుల శ్రమ ఫలితమైన అదనపు ఉత్పత్తిని, ఉత్పత్తితో సంబంధంలేని బ్రాహ్మణ, క్షత్రియులకి జేరవేయాలి. రాజ్యవ్యవస్థ పుట్టింది. రాజ్యాన్ని పోషించటానికి పన్నులు వేయాలి. వైశ్యులు పన్నులు కట్టాలి. శూద్రులు పనిచేయాలి. ఇది కొనసాగాలంటే రాజ్య వ్యవస్థతో పాటు వర్ణవ్యవస్థ వర్ధిల్లాలి. వర్ణాన్ని కాపాడటం రాజ్యధర్మంగా చెప్పారు.

అదనపు ఉత్పత్తితో వైశ్యులలో ఒక కొత్త వర్గం పుట్టింది. వ్యవసాయంలో వచ్చిన ఆదాయాల్ని కొందరు వైశ్యులు వ్యాపారంలోకి మళ్లించారు. పట్టణాలలో వర్తక శ్రేష్టులుగా, గృహపతులుగా స్థిరపడ్డారు. ఈ వర్గం పన్నులు చెల్లించి పాలకులకి దగ్గరయింది. వర్ణంలో వర్గం పుట్టింది. వర్ణంలో ఆర్థిక ప్రయోజనాలు అగ్రస్థానానికి జేరాయి.

వ్యవసాయ, వ్యాపారాభివృద్ధికి వైదిక భావజాలం అడ్డంకి అయింది. బ్రాహ్మణ ఆధిపత్యాన్ని క్షత్రియులు, వ్యాపారులు ప్రశ్నించసాగారు. పాలకులలో వైరుధ్యం తీవ్రమైంది. కొత్తగా వచ్చిన జైన, బౌద్ధ మతాలు రాజరిక, వ్యాపార ప్రయోజనాలకనుగుణంగా వున్నాయి. వాటిని స్వాగతించారు. బ్రాహ్మణుల ప్రాబల్యం తగ్గి, ఆదాయానికి గండిపడింది.

మౌర్యుల తదనంతరం బ్రాహ్మణ్యం తిరిగి తలెత్తింది. వైదికమతం తన దారి మార్చింది. ప్రధాన ఆదాయ వనరుగా వున్న వ్యవసాయాన్ని త్రోసిరాజనటం అసంభవం. ఇంద్రుడు తదితర వైదిక దేవుళ్లను ప్రక్కన పెట్టి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను ముందుకు తెచ్చింది. వైదికం హిందూమతంగా కొత్తరూపం దిద్దుకొంది.

గుప్తులు హిందూమతాన్ని వైభవోపేతంగా తీర్చిదిద్దారు. వారి కాలంలో బ్రాహ్మణులకు స్వర్ణయుగం. రాజరిక పాలనలో మంత్రులు, ఉన్నతోద్యోగులు, న్యాయాధిపతులు బ్రాహ్మణులే. వేదకాలం నుండి చదువుపై గుత్తాధిపత్యం వారిదే గదా.

గుప్తుల కాలంలో ఆర్థిక సంక్షోభం ముంచెత్తింది. బ్రాహ్మణులకు దానాలు ఉన్నతోద్యోగులకి జీతాలు యివ్వలేని పరిస్థితి ఏర్పడింది. తొలిసారిగా భూదానాలు దానంగా యివ్వసాగారు. వారు వాటిపై స్వతంత్ర ప్రతిపత్తిని సంపాదించుకొని భూస్వాములయ్యారు.

బ్రాహ్మణులు వ్యవసాయం చేయరు. ఆటవిక తెగల్ని వ్యవసాయంలోకి దింపాలి. కళింగ యుద్ధం నేర్పిన పాఠాల్ని పాలకవర్గాలు మర్చిపోలేదు. బుద్ధుడి మార్గాన్ని ఎన్నుకున్నారు. అహింసే పరమ ధర్మం అన్నారు. అదే అస్త్రాన్ని ఆటవిక తెగలపై ప్రయోగించి, సాంస్కృతికంగా తమ మార్గానికి తెచ్చుకున్నారు. తెగలను హిందూ కులాలలోకి లాగారు. ఒక తెగ ఒక కులమైంది. తెగ పూజారులు, మంత్రగాళ్లకు బ్రాహ్మణ్యాన్ని, నాయకులు, యుద్ధవీరులకి క్షత్రియాన్ని, ఇతర వృత్తులవారికి శూద్ర కులాన్ని ప్రసాదించారు. మంత్రోచ్చారణతో శుద్ధి కార్యక్రమాన్ని జరిపి మరీ అమలు చేశారు. మలివేదయుగానికి, పశుపోషణ సమాజానికి నాలుగు వర్ణాలు సరిపోయాయి. బౌద్ధయుగంలో వ్యవసాయ సమాజం ప్రారంభమైంది. గుప్తుల కాలం నాటికి వ్యవసాయం, వ్యాపారమే కాదు, ఎన్నో వృత్తులు ఉత్పత్తి క్రమంలోకి వచ్చాయి. వర్ణవ్యవస్థ సరిపోదు. వర్ణం కులంగా విస్తృత రూపం దాల్చింది.

కులంతో వర్ణ సంకరమై బ్రాహ్మణ్యాన్ని ప్రమాదంలో పడవేసింది. తమ పెత్తనం, పవిత్రత, దోపిడీ కొనసాగాలి. మనుధర్మ శాస్త్రాన్ని తెచ్చారు. కులధర్మాన్ని నిర్వచించి న్యాయశాసనంగా క్రోడీకరించారు. బ్రాహ్మణ ఆధిపత్యాన్ని, శూద్రుల స్థానాన్ని గుర్తుచేశారు. కులాన్ని, కులవృత్తులను జన్మతో ముడివేశారు. కులాల మధ్య అంటు ఆచారాల్ని ప్రవేశపెట్టారు. అగ్రకుల స్త్రీని పెళ్లాడితే పుట్టిన పిల్లలు అస్పృశ్యులవుతారన్నారు. కులాల మధ్య పెళ్లిళ్లపై శాశ్వతమైన విభజన రేఖలు గీశారు.

తెగలలో విభిన్న ఆచార సంప్రదాయాలుంటాయి. తెగలు కులాలుగా మారినపుడు పాత ఆచారాలు సంప్రదాయాలు కులాలను వదలలేదు. సాధారణంగా కొన్ని తెగలు ఇతర తెగలవారిని పెళ్లాడరు. కులంలో కూడ అదే కొనసాగింది. తెగలలోని వృత్తులే కులవృత్తులుగా సంక్రమించాయి.

తెగలలో కూడ సాంస్కృతికంగా తరతమ బేధాలుంటాయి. పెద్ద, చిన్న తేడాలుంటాయి. యుద్ధాలలో విజేతలు, పరాజితులు వుంటారు. సాగుచేసే పంట పొలాల నాణ్యత హెచ్చు తగ్గులుంటాయి. తెగలు కులాలుగా మారిన తర్వాత కూడ ఈ భేదాలు కొనసాగాయి. పెద్ద కులాలు, చిన్న కులాలుగా విడిపోయాయి.

పూర్వం వైశ్యులు స్వతంత్ర రైతులు. భూదానాలతో కొత్తగా భూస్వామ్య వర్గం ఏర్పడటంతో వారి స్థాయి తగ్గింది. మరోవైపున గిరిజనులు పెద్ద యెత్తున హిందూమతంలోకి లాగబడ్డారు. క్రీ.శ. 7వ శతాబ్దానికి వ్యవసాయదారులుగా గుర్తింపబడ్డారు. దీనితో వైశ్యులకు, శూద్రులకు మధ్య గీత చెరిగిపోయింది.

బ్రాహ్మణులు భూస్వాములుగా మారిన తర్వాత శూద్రులు వ్యవసాయదారులుగా ఎదిగారు. వారి స్థాయి పెరిగింది. వైశ్యుల స్థితి దిగజారింది. పైగా వైశ్యులలో సంపన్నులు వ్యాపారవర్గాలుగా పట్టణాలలో స్థిరపడ్డారు.

శూద్రుల ఆదాయం పెరగటంతో రైతులయ్యారు. గ్రామాలలో భూస్వాములు – రైతులనే వర్గాలు ఏర్పడినాయి. ఆర్థికంగా బలపడిన శూద్రకులాలకు కర్మకాండలు చేసే భాగ్యం లభించింది. బ్రాహ్మణులకు కొత్త దక్షిణలు దొరికాయి.

కులం ఎక్కడా స్వతంత్రంగా మన లేదు. ఉత్పతి క్రమంలో భాగంగానే మారుతూ వచ్చింది. రాజ్యవ్యవస్థ, కులవ్యవస్థ రెండూ అదనపు ఉత్పత్తిని పాలకవర్గాలకి, అగ్రకులాలకి జేరవేయటానికే ఏర్పడినవి.

మధ్యయుగాల్లో కులం

క్రీ.శ. 700–1200 రాజపుత్రుల కాలం

క్రీ.శ. 1200–1750 మహమ్మదీయుల కాలం

ఎందరో రాజులు ఉపఖండంలో ఎన్నో ప్రాంతాల్ని ఏలారు. నిజానికి వారందరూ క్షత్రియ వర్ణం వారు కాదు. వాయువ్య సరిహద్దులు ఆక్రమించి రాజ్యాలు స్థాపించిన విదేశీయులైన శకులు, కుషానులకు బ్రాహ్మణులు క్షత్రియ ముద్ర వేశారు. మధ్య యుగాలలో రాజులైన శివాజి లాంటి పాలకుల్ని క్షత్రియుల్ని చేశారు.

రాజపుత్రుల కాలంలో హిందూ సంస్కృతి మునుపటిలాగానే కొనసాగింది. కులవ్యవస్థకి రాజపోషణ దండిగా లభించింది. కొత్త కులాలు, ఉపకులాలు పుట్టుకొచ్చాయి. హిందూ మత పీఠాలు వెలిశాయి. విలాస జీవితానికి కేంద్రాలుగా మారాయి. దేవాలయాలలో దేవదాసీ వృత్తిని ప్రవేశపెట్టి వ్యభిచారాన్ని అధికారికం చేశారు. భూమి రాజుది. రాజుకి కప్పాలు చెల్లించుచూ రెండవ వరుసలో జమీందారులుంటారు. గ్రామీణ ప్రాంతాలలో భూస్వాములదే పెత్తనం. పాలకుల కులానికి అతి ఆదరణ లభించింది. నిఖార్సయిన ఈ ఫ్యూడల్ వ్యవస్థ హిందూ రాజుల కాలంలోనే గాదు, మహమ్మదీయ చక్రవర్తుల కాలంలో కూడా కొనసాగింది.

క్రీ.శ. 1175లో మహ్మద్ ఘోరీ దండయాత్రతో ముస్లిం పాలనకి పునాది పడింది. ముస్లిం పాలకులు కులాన్ని వ్యతిరేకించలేదు. నిజానికి కులం ఇస్లాం న్యాయానికి విరుద్ధమైనది. అయినా హిందువుల విగ్రహారాధన, బహు దేవతారాధనను పదేపదే విమర్శించారేగాని కుల అసమానతలను ముస్లింలు ఏనాడూ ప్రశ్నించలేదు. బలమైన ప్రత్యర్థి కులాలను అణచివేయటానికి ప్రయత్నించారు. క్రీ.శ. 8వ శతాబ్దంలో జాట్‌లు చండాలురు తరహాలో హీన స్థితిలో వుండేవారు. వారిపై అనేక ఆంక్షలుండేవి. ఆనాటి సింధ్ పాలకులైన అరబ్‌లు కూడ అవే ఆంక్షలను కొనసాగించారు.

క్రీ.శ. 11వ శతాబ్దంలో నేతపని, తోలుపనితో సహా 12 వృత్తులవారిని నీచస్థాయి కులాలుగా పేర్కొన్నారు. అది పాలకవర్గాలకి లాభం. కారణం? కులం ఎంత తక్కువయితే, వారి ఉత్పత్తులకిచ్చే రేటు అంత తక్కువగా వుంటుంది. ఇదోరకం దోపిడీ. పైగా గ్రామాలలో వీరికిచ్చే కూలీ వస్తు రూపంలో వుంటుంది. గిరాకీ తక్కువ. పట్టణాలలో ఇవే ఉత్పత్తులకు గిరాకీ ఎక్కువ వుంటుంది. ద్రవ్యరూపంలో చెల్లిస్తారు.

ఇస్లాం పాలనలో కూడ కులవ్యవస్థ చలనరహితంగా లేదు. అందుకు పాలకుల ప్రమేయం ఏమీలేదు. క్రీ.శ. 13 – 14 శతాబ్దాలలో కొత్త టెక్నాలజీ ప్రవేశించింది. కొత్త ఉత్పత్తులు, కొత్త సేవలు ప్రారంభమైనాయి. వడికే రాట్నం, కాగితం తయారీ, గోపురం నిర్మాణం, సున్నపురాయి వాడకం, గుర్రపునాడా మొదలైనవి కొత్త సాంకేతిక పరికరాలతో కొత్త వృత్తులు ఏర్పడినాయి. ఆ కాలంలో సుల్తానుల దగ్గర బానిసలు కూడ పెద్ద సంఖ్యలో వుండేవారు. బానిసలకు కులం లేకుండా చేశారు. వృత్తి విద్యలు నేర్పించారు. కాలక్రమంలో వీరు బానిసత్వం నుండి బయటపడి ముస్లిం వృత్తులవారి సరసన జేరారు. హిందూ కులాలలో నీచంగా చూడబడేవారు స్వేచ్ఛను కోరుకొని, కొత్త వృత్తులు నేర్చుకొని, ఉన్నత జీవితం కోసం ఇస్లాంలోకి జేరారు. ముస్లింల సంఖ్య గణనీయంగా పెరిగింది. అదే సమయంలో కుల ప్రభావం ముస్లింలకు కూడ అంటింది. ముస్లింలలో కొన్ని వెనుకబడిన కులాలు ఏర్పడినవి.

ఫ్యూడల్ వ్యవస్థ కులం పునాదులను పటిష్టం చేసింది. అది హిందూమతమా? ఇస్లాం మతమా? అనేది ఇక్కడ ప్రధానం కాదు. ఏ మతమైనా వర్గదోపిడీకి తలవంచింది. కులానికి, మతానికి, రాజ్యవ్యవస్థకి లంకె ఏర్పడింది. ఆర్థికవనరులపై ఆధిపత్యం వున్నవారే అగ్రకులాలుగా చలామణి అయ్యాయి. ఆ ప్రాంతాలలో అగ్రకులాలుగా వున్నవారే జమీందారులయ్యారు.

ఆధునిక యుగంలో కులం

ఆధునికయుగంలో బ్రిటీష్ వలసవాదులు కులవ్యవస్థను తమ ప్రయోజనాలకనుకూలంగా మలుచుకున్నారు. ఆర్యుల వలసల్ని సాకుగా చూపి తమ సామ్రాజ్యపాలనను సమర్థించుకున్నారు. కులాల మధ్య అగ్గి పెట్టి తమ పబ్బాన్ని గడుపుకున్నారు. విద్యావంతులైన బ్రాహ్మణుల నుండి తమ పాలనకు సహాయ సహకారాలు పొందారు. నిమ్న కులాలలో క్రైస్తవ్యాన్ని ప్రోత్సహించారు. సాంస్కృతికంగా వెనుకబడిన కులాలను, తెగలను దొంగలు, దోపిడీగాళ్లుగా ముద్రవేసి 'సెటిల్మెంట్ కులాలు'గా బంధీ చేశారు.

పారిశ్రామికీకరణ, నగరీకరణ ప్రభావం కులాలపై సహజంగా ఎక్కువగా వుంటుంది. విభిన్న కులాలు ఒకేచోట కలిసి పనిచేయాల్సి వస్తుంది. ఒకే ప్రయోజనాల్ని కలిగి వుంటాయి. కలిసి తినాలి, కలిసి తిరగాలి. కుల కట్టుబాట్లను ప్రక్కన బెట్టాలి.

1853లో బ్రిటిష్‌వాళ్లు భారతదేశంలో రైళ్లను ప్రవేశపెట్టటంతో పారిశ్రామికీకరణకు అడుగు పడిందని, ఈ కొత్త ఉత్పత్తి విధానం కులవృత్తులను దెబ్బతీస్తుందనుకున్నారు. కాని ఇండియాలో పారిశ్రామికీకరణ బ్రిటీష్ ఎజెండా కాదు. ఇక్కడి ముడిసరుకును తరలించటమే వారి అసలు ఉద్దేశ్యం. వలస పాలన లేకుంటే యూరప్‌లో వలె భారత ఉపఖండంలో కూడ స్వతంత్ర జాతులు ఆవిర్భవించేవి.

వలస పాలకులు పారిశ్రామికీకరణకు అంగీకరించరు. ఇక్కడి స్థానిక చేతి పరిశ్రమలను నాశనం చేయటం, విదేశీ సరుకుతో మన మార్కెట్లను నింపటమే వారి ధ్యేయం. బ్రిటీష్ పాలన కులవ్యవస్థపై పెద్ద ప్రభావం చూపలేకపోయింది. కొన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులు కట్టారు. వ్యవసాయం అభివృద్ధి చెందింది. ప్రాజెక్టుల ఖర్చు కంటె పన్నుల రాబడి ఎక్కువ. ఈ ప్రాజెక్టు వల్ల నదీపరివాహక ప్రాంతాలలోని వ్యవసాయ కులాలు ఆర్థికంగా, సామాజికంగా బలపడినాయి. కృష్ణా, గోదావరి తీరాలలో ఈ మార్పును మనం స్పష్టంగా చూడగలం.

తెలుగు రాష్ట్రాలలో కమ్మ, రెడ్డి, కాపు, రాజు, వెలమ వ్యవసాయ శూద్ర కులాలు ఇరిగేషన్ ప్రాజెక్టులు రాకపూర్వం వెనుకబడిన స్థితిలో వుండేవారు. భూములు బ్రాహ్మణుల చేతిలో వుండేవి. వారు పట్టణాల బాట పట్టటంతో, ఈ కులాలకు చెందిన రైతులు పెద్దయెత్తున వ్యవసాయం చేయసాగారు. స్వాతంత్ర్యానంతరం నీటి ప్రాజెక్టులు, విద్యుత్ సౌకర్యాలతో, కొత్త వరి వంగడాలతో, వ్యాపార పంటలతో ఈ శూద్ర కులాల ఆర్థిక వనరులు పెరిగాయి. వారు తమ ఆదాయాలను వ్యవసాయేతర రంగాలకు మళ్లించారు. సివిల్ కాంట్రాక్టులు, మిల్లులు, రవాణా, సినిమాలు, వ్యాపారం, చదువులలో పెట్టుబడులు పెట్టారు. ఈనాడు వీరు అగ్రకులాలుగా, ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఆధిపత్యంలో వున్నారు. ఇక్కడ కులం అంటే కులమంతా అనిగాదు. కులంలో పేద, ధనిక వర్గాలున్నాయి. ధనికవర్గం అధీనంలోనే భూమి, గనులు, అటవీసంపదలు, తదితర ఆర్థిక వనరులున్నాయి. ఒకప్పుడు ఈ కులాల విద్యార్థులకి పట్టణాలలో వసతి గృహం కూడ దొరికేది కాదు. అప్పుడు బ్రాహ్మణుల ఆధిపత్యం అంత ఎక్కువగా వుండేది.

ఉత్తర భారతదేశంలో మరో వ్యవసాయ కులం జాట్‌లు. 8వ శతాబ్దంలో హీనస్థితిలో వుండేవారు. తర్వాత పశుపోషకులు. 11వ శతాబ్ది నాటికి శూద్ర స్థాయినందుకున్నారు. 17వ శతాబ్దంలో వ్యవసాయదారులు. ఇపుడు ఉత్తరాది రాష్ట్రాలలో ఒక అగ్రకులం.

కులం సామాజిక దొంతరలు మారనవి కావు. శాశ్వతం కాదు. ఆయాప్రాంతాలలోని ఆర్థికస్థితిగతులకనుగుణంగా అవి మారుతూ వున్నాయి. ఈ మార్పు ఆర్థిక వనరులపై పట్టు సాధించటంతో ముడిపడి వుంది.

కులవృత్తులు పుట్టుకతో వస్తాయి. వంశపారంపర్యంగా కొనసాగుతాయి అని ధర్మశాస్త్రాలు చెప్పాయి. కులవృత్తులు ప్రాచీనకాలం నుండి 18వ శతాబ్దం వరకు కొనసాగినట్లు ఆధారాలు కనిపిస్తున్నాయి. ఆ తర్వాత పారిశ్రామికీకరణ ప్రభావం కులాలపై పడింది. ప్రపంచీకరణ – సరళీకృత ఆర్థిక విధానాలతో కులవృత్తులు కనుమరుగవటం స్పష్టంగా కనిపిస్తోంది.

గత మూడు దశాబ్దాలలో ప్రపంచీకరణ – సరళీకృత ఆర్థిక విధానాల మూలంగా మనదేశంలో మౌలిక మార్పులు చోటుచేసుకున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో పాత భూస్వామ్య వర్గం స్థానే కొత్త ధనికవర్గం అన్ని రంగాలలోను కీలకపాత్ర పోషిస్తుంది. ఈ ధనికవర్గం తమ వ్యవసాయ సంపదల్ని రియల్ ఎస్టేట్, విద్య, రవాణా, పారిశ్రామిక, సేవారంగాలలో పెట్టుబడులుగా తరలిస్తోంది. ఏ పార్టీ అధికారంలో వున్నా ప్రభుత్వాలతో కుమ్మక్కై తమ ఆస్తులను, అధికారాలను కాపాడుకోవటం వీరి నైజం. గనులు, బ్యాంకులు, పబ్లిక్ ఆస్తుల్ని, ప్రభుత్వ పెట్టుబడులను దోచుకోవటం ద్వారా వీరు ఆదాయ వనరులను ఎన్నో రెట్లు పెంచుకున్నారనేది బహిరంగ రహస్యం.

దేశ ఆర్థికపట్టు కొందరి గుప్పెట్లో వుంది. వీరే పశ్చిమ భారతానికి చెందిన బ్రాహ్మణ – బనియా కంపెనీలు. ఏటా వీరి ఆదాయం ప్రభుత్వ వార్షిక బడ్జెట్ కంటె ఎక్కువ. కీలకరంగాలన్నింటిలోను పెట్టుబడులున్నాయి. కార్పొరేట్ వ్యవసాయానికి కూడ గేట్లు ఎత్తేశారు. ప్రభుత్వ ఆర్థిక, రాజకీయ నిర్ణయాలను నిస్సందేహంగా వీరు ప్రభావితం చేయగలరు. విదేశీ బహుళజాతుల కంపెనీలతో మిలాఖత్ ఒప్పందాలున్నాయి గనుకనే ఈ 'స్వదేశీ' కంపెనీలు నిలబడగల్గుతున్నాయి. మన మార్కెట్‌లన్నీ విదేశీ వస్తువులతో వెలిగిపోతున్నాయి.

ఈ ఆర్థిక విధానాల ఫలితంగా వ్యవసాయం సంక్షోభంలో పడింది. కూలీలు నగరాలకు వలసపోతున్నారు. వ్యవసాయేతర వృత్తులలోకి ప్రవేశిస్తున్నారు. ఒకప్పుడు రైతాంగం పోషించే చాకలి, మంగలి, కుమ్మరి, కమ్మరి, వడ్రంగి వృత్తులు అంతరించి పోతున్నాయి. పాలేరు వ్యవస్థ పోయింది. వెనుకబడిన కులవృత్తులైన సారాయి, చేపలు, రొయ్యలు సంపన్న అగ్రకులాల కార్పొరేట్, సిండికేట్ వ్యాపార కేంద్రాలైనాయి. ఎరుకల వృత్తిని కూడ కంపెనీలు ఎగరేసుకుపోయాయి.

ఈ మార్పులను ఎలా అర్థం జేసుకోవాలి? ఒకనాటి కులపరమైన సహజ ఆర్థిక విధానం అంతరిస్తోంది. గ్రామీణ ప్రాంతాలలో కూడా వస్తు మారకాన్ని డబ్బు ఆక్రమించింది. సరుకు లేదా డబ్బే సర్వస్వంగా పెట్టుబడిదారీ సంబంధాలు బలపడుతున్నాయి. ఇది దేశమంతటా ఒకేలా లేదనేది నిర్వివాదాంశం. కాని వ్యవసాయం నుండి వ్యవసాయేతర పెట్టుబడులు పెరుగుతున్న ప్రాంతాలలో ఈ మార్పును స్పష్టంగా గమనించవచ్చు. సామాజికాభివృద్ధి క్రమంలో ఉత్పత్తి సంబంధాల్ని నిర్ణయించేటప్పుడు అత్యున్నత ఆర్థికస్థాయిని ప్రామాణికంగా పరిగణనలోకి తీసుకోవాలి.

సంస్కరణలు - కులం

బౌద్ధయుగంలోనే కులానికి పునాదులు పడ్డాయి. కులభావజాలం రూపుదిద్దుకుంది. బుద్ధుని బోధనలు కులవ్యవస్థని కదలించలేకపోయాయి. బౌద్ధ సంఘాలలోకి అన్ని కులాలను ఆహ్వానించినా, కులవ్యవస్థని కూలద్రోయమని బుద్ధుడు ఎక్కడా చెప్పలేదు. క్షత్రియుల, వ్యాపారుల ప్రయోజనాలను కాపాడాడు. కులసమస్య సామాజికమైనది. బుద్ధుడి పరిష్కారం వ్యక్తిగతమైనది, మానసికమైనది.

హిందూమతంలోని కులవ్యవస్థకు వ్యతిరేకంగా మధ్యయుగాలలో భక్తి ఉద్యమాలు బయలుదేరాయి. దేవుడు ఒక్కడే. దేవుని ముందు అందరూ సమానులేనని భక్తిపాటలు రాశారు. క్రీ.శ. 6-7 శతాబ్దాలలో తమిళంలో ఆళ్వార్, నయనార్ కవితలు ప్రజాదరణ పొందాయి. క్రీ.శ. 12వ శతాబ్దంలో బసవన్న ప్రవచనాలతో లింగాయత్ ఉద్యమం కర్నాటకలో పుట్టి పెరిగింది. 13వ శతాబ్దంలో మహారాష్ట్రలో జ్ఞానదేవ్, నామ్‌దేవ్, తుకారాం భక్తి ఉద్యమాలు నడిచాయి. బ్రాహ్మణులను ధిక్కరిస్తూ మరాఠీలో మత విషయాలపై రచనలు చేశాడు. 13-14 శతాబ్దాలలో ఉత్తర భారతంలో కబీర్ గొప్ప కవి. హిందూమతాన్ని, ఇస్లాంను వ్యతిరేకించాడు. ఏకేశ్వరోపాసన బోధించాడు. శిక్కు మత స్థాపకుడు గురునానక్ బోధనలు ఆది గ్రంథంలో వున్నాయి. ఖాల్సాను ఏర్పాటుచేశాడు. కులాలకతీతంగా అందరూ ఒకే వంటశాలలో భోజనం చేయాలన్నాడు. 17వ శతాబ్దంలో జాట్‌లు అత్యధికంగా శిక్కు మతంలోకి జేరారు. పోతులూరు వీరబ్రహ్మంగారు తెలుగువారందరికి తెలుసు. బ్రాహ్మణిజానికి వ్యతిరేకంగా చేతివృత్తి కులాలను చైతన్యపరిచాడు. వేమన మహాకవి. తేటతెలుగులో పద్యాలను రచించి కులాలకు వ్యతిరేకంగా జనాన్ని చైతన్యం చేశాడు.

నేత, కుమ్మరి, కమ్మరి, మంగలి, పాకీ, దూదేకులు, జాట్ తదితర వెనుకబడిన కులాలు భక్తి ఉద్యమాలలో పాల్గొన్నాయి. ఈ ఉద్యమాలలోకి అన్ని కులాలు ప్రవేశించవచ్చు. అందరూ సమానమే. సమానత్వాన్ని భక్తి భజనలకే పరిమితం చేసి, సామాజిక, ఆర్థిక అసమానతలను దేవుడిపైకి నెట్టివేసిన ఈ ఉద్యమాలు కులవ్యవస్థ పునాదులను కదలించలేకపోయాయి. చివరికి ఆ వ్యవస్థకే బలైపోవటం కొసమెరుపు. శిక్కు మతాలలో కులాలు వున్నాయి. లింగాయత్‌లు ఒక అగ్రకులంగా మారిపోయారు. దానిలో అనేక ఉపకులాలు వున్నాయి. బ్రహ్మసమాజం, ఆర్యసమాజం లాంటి సంస్థలు హిందూమతాన్ని సంస్కరించటానికి తీవ్ర ప్రయత్నాలు చేసినా ఫలితాన్ని సాధించలేకపోయాయి.

కులవివక్ష వ్యతిరేకపోరాటంలో చదువును మార్గంగా ఎంచుకున్న గొప్ప సంస్కర్త జ్యోతిబా ఫూలే. 1848లో ఆడపిల్లల స్కూలు ప్రారంభించాడు. వెనుకబడిన కులాలలో, ముఖ్యంగా స్త్రీలలో విద్యాబోధనతో చైతన్యాన్ని రగిలించాడు.

సంస్కరణవాడంలో ఒక ప్రధాన లోపం వుంది. హిందూ మతంలోని చెడును సంస్కరించి ఆ మతాన్ని పునీతం చేయాలని తలచారేగాని కులవ్యవస్థను నిర్మూలించాలని, కులంలేని సమాజం ఆవిర్భవించాలని మెజారిటీ సంస్కరణవాదులు ప్రయత్నించలేదు. కుళ్ళిపోయిన శరీర భాగం నుండి దుర్వాసన రాకుండా చూడాలనుకున్నారుగాని, ఆ భాగాన్ని తొలగించాలని కోరుకోలేదు.

జాతీయోద్యమంలో జనం మధ్య కులాల అడ్డుగోడలు నిలిచాయి. హిందూవ్యవస్థలో అగ్రకులాలకు, నిమ్నకులాలకు మధ్య ఎడం ఏర్పడింది. కోట్లాది అట్టడుగుకులాలు లేకుండా స్వాతంత్ర్యోద్యమం విజయవంతమవదు. గాంధీజీ వారికి 'హరిజన' అని ముద్దు పేరుపెట్టి రంగంలోకి దిగాడు. గాంధీజీ ఎన్నడూ కులవ్యవస్థను వ్యతిరేకించలేదు. జాతిని ఏక త్రాటిపైకి తెచ్చే ఒక గొప్ప అవకాశం జారిపోయింది.

కులవ్యవస్థపై భారత కమ్యూనిస్టులు తొలి నుంచి ఖచ్చితమైన వైఖరిని అవలంబించలేదు. నిజాం ఫ్యూడల్ వ్యతిరేక పోరాటంలో మతాల్ని, కులాల్ని ఏకం చేయగలిగారు గాని, ఆ పోరాట స్ఫూర్తిని తర్వాత కొనసాగించలేకపోయారు. పార్టీ సిద్ధాంత, కార్యక్రమాలలో కులం అనే పదాన్ని పక్కన పెట్టారు. గాంధీజీ హరిజన పిలుపు మాయలో పడ్డారు. అగ్రకులాలకి, నిమ్నకులాలకి మధ్య వైరుధ్యాన్ని, ఈ దేశంలోని దాని ప్రత్యేకతను అర్థం చేసుకోలేకపోయారు.

సంస్కరణవాదులను విమర్శిస్తూనే డా॥ అంబేద్కర్ తన 'కులనిర్మూలన' గ్రంథంలో అదే బాటన నడిచాడు.

"అంతర్వివాహం ఒక్కటే కులం అసలైన లక్షణం" అన్నాడు.

కులనిర్మూలనకు పరిష్కార మార్గం చెప్పాడు..

"కుల నిర్మూలనకు సరైన పద్ధతి వర్ణాంతర వివాహాలేనని నా దృఢ విశ్వాసం. రక్త సమ్మిశ్రణ ఒక్కటే మానవులలో అన్యోన్య అనుబంధ భావాన్ని, బాంధవ్యాన్ని కలిగిస్తుంది. అట్టి బంధుభావ ప్రభావం లేనిదే కులం కల్పించిన విభేదాలను, వివక్షతలను రూపుమాపలేం. వివిధ కులాల మధ్య స్నేహానుబంధాలను కలిగించాలంటే ఆయా కులాల వ్యక్తుల నడుమ రక్త సంబంధాలను కల్పించక తప్పదు."

కులాల్ని రక్త సమ్మిశ్రణ చేసి, రక్త సంబంధాల బంధంగా మారిస్తే స్నేహం, బంధుభావం వెల్లివిరిసి అన్యోన్య అనుబంధం అల్లుకుంటుందని అంబేద్కర్ చెప్పాడు. ఆస్తి అంతస్తులలో అంతరాలు వుంటే ఒకే కులంలో కూడ పెళ్ళిళ్లు కావటంలేదనే సత్యాన్ని దాచేద్దామా?

చివరికి కులం అనేది కేవలం ఒక 'భావన'గా తేల్చివేశాడు.

"కులం అనేది హిందువులను కలవకుండా చేసే ఒక ఇటుక గోడో, ముళ్ళతీగో కాదు, సులభంగా తొలగించి పారవేయడానికి.

హిందువులకు కులం అనేది ఒక భావన. ఒక విశ్వాసం. ఒక మానసిక స్థితి. కులాన్ని తొలగించడం అంటే – భౌతికమైన ఒక అడ్డంకిని తొలగించటం కాదు. మనోభావనలోనే ఒక మార్పును సాధించడం."

ఎలా సాధించాలి?

"మనం అనుసరించవలసిన సరైన మార్గం ఏమిటంటే – ఆగమ శాస్త్రాల పట్ల, వాటి పవిత్రత పట్ల ప్రజలకు గల విశ్వాసాన్ని తొలగించడం".

సాధ్యమా?

"ఈ పని అంతా నిజంగా దుస్సాధ్యం అనిపిస్తుంది".

"కులవ్యవస్థను ఛేదించటానికి మీరుపయోగించే డైనమైట్లను వేదాలపైన, ఆగమ శాస్త్రాలపైన ప్రయోగించవలసి వుంటుంది. హేతువాదానికి, నైతిక శక్తికి స్థానం లేకుండా చేస్తున్నది అవే. వాటిని ఛేధిస్తేనే తప్ప కులవ్యవస్థను ఛేదింపలేము".

కులంలోని 'భావన'ని మాత్రమే చూసిన డా॥ అంబేద్కర్ కులానికి ఆర్థిక వనరులకి గల సంబంధాన్ని, ఉత్పత్తి వాటాలో కులాల పంపిణీని ప్రస్తావించలేదు. కులంలోని ఆర్థిక అంశాన్ని దాదాపు ప్రక్కన పెట్టేశాడు. వ్యక్తి, కుటుంబం మానసిక పరివర్తనతో కులం నిర్మూలింపబడుతుందని అభిప్రాయపడ్డాడు. అగ్రకులాలకు, నిమ్నకులాలకు మధ్యనున్న ఆర్థిక అంతరాల్ని చూడ నిరాకరించాడు. నిమ్నకులాల్ని దోపిడీ చేయటం ద్వారానే అగ్రకులాల ఆధిపత్యం ప్రాధమికంగా చలామణి అవుతున్నదనే సత్యాన్ని మరుగుపరిచాడు.

వర్గం - కులం

వర్గం అంటే పేదలు, ధనికులు.

కులం అంటే ప్రభుత్వ లెక్కల ప్రకారం ఒసి, బిసి, యస్‌సి, యస్‌టిలు.

ఏ వర్గమైనా, ఏ కులమైనా అందరూ అనివార్యంగా కలుసుకొనేది ఉత్పత్తి క్రమంలోనే.

ఉత్పత్తి క్రమం అంటే ఆర్థిక వనరుల్ని తమ ప్రయోజనాలకనుగుణంగా మార్చుకొనడం. శ్రమించి సృష్టించిన ఉత్పత్తి లేదా సంపదని పంపిణీ చేయడం. ఈ ఉత్పత్తి లేదా సంపద ఎవరిది? ఎవరికి పంపిణీ చేయాలి? ఇదే కీలక ప్రశ్న.

ఆర్థికవనరులపై యాజమాన్యం ఎవరిదో, పంపిణీ కూడా వారిదే.

ధనవంతుల యాజమాన్యంలో వుంటే ధనవంతులది. పేదల యాజమాన్యంలో వుంటే పేదలది.

వర్గ సంబంధాలే కాదు, కుల సంబంధాలకు కూడ ప్రధాన ప్రాతిపదిక ఉత్పత్తి క్రమమే.

దేశంలోని ఒసి, బిసి, యస్‌సి, యస్‌టిలలో ఆర్థికవనరులపై యాజమాన్యం ఏ కులాలది?

జాతీయ ఆదాయం అందరి కష్టార్జితం. అది మనం చిందించిన చెమట, రక్తం. ఎలా పంపిణీ అవుతుందో చూడండి.

* జాతీయాదాయంలో 77 శాతం జనాభాలోని 10 శాతానికే జేరుతోంది.

2017లో సృష్టింపబడిన జాతీయ ఆదాయంలో 73 శాతం కేవలం ఒక శాతానికి మాత్రమే జేరింది. దేశంలో అత్యంత పేదలైన 67 మిలియన్ల భారతీయుల ఆదాయం 1 శాతం మాత్రమే.

* దేశంలో బిలియనీర్ల సంఖ్య 119.

వీరి సంఖ్య 2000 సం॥లో 9. 2011 సం॥లో 101.

2018-22 సం॥లలో రోజుకి 70 కొత్త మిలియనీర్లు పుడుతున్నారు.

గత దశాబ్దంలో బిలియనీర్ల సంపద 10 రెట్లు పెరిగింది. (Oxform రిపోర్టు)

భారత ప్రభుత్వం 2018-19 బడ్జెట్ కంటే వీరి సంపద ఎక్కువ. పేద, ధనిక వర్గాల మధ్యే కాదు, అగ్రకులాలు, నిమ్నకులాల మధ్య ఆదాయ వ్యత్యాసాలు భారీగా వున్నాయి.

భారతదేశంలో సగటు కుటుంబ ఆదాయం = రూ.113. 222.

జాతీయ ఆదాయంలో అగ్రకులాలది ఏటా 47 శాతం. ఈ అగ్రకులాలలో 10 శాతం మంది 60 శాతం సొంతం చేసుకుంటున్నారు. 1శాతం మంది ఆదాయం ఒక దశాబ్ద కాలంలో 16 శాతం నుండి 29.4 శాతానికి పెరిగింది. (2012)

అగ్రకులాలలో సగటు జాతీయ ఆదాయం కంటే బ్రాహ్మణులు 48 శాతం, బ్రాహ్మణేతరులు 45 శాతం ఎక్కువ కలిగివున్నారు. అదే సమయంలో జాతీయ ఆదాయం కంటె యస్.టిలు 34 శాతం, యస్..సిలు 21 శాతం, ఓ.బి.సిలు 8శాతం తక్కువకి పరిమితమయ్యారు.

అత్యంత ధనిక కులాలు; బ్రాహ్మణులు 50%. బనియాలు 44%. రాజపుట్లు31%. కాశ్యపలు 57%.

(Wealth Inequality Class & Caste 1961-2012) Paris School of Economics Paper Published in Nov 2018.

హిందూ అగ్ర కులాలలోని 22% వాటా దేశం మొత్తం సంపదలో 41%. అతి తక్కువ వాటా యస్.టి లది. కేవలం 3.7%. (BI India Bureau Feb 14, 2019. Savithribai Phule University, Pune. Jawaharlal Nehru Universiy, Delhi. Indian Institute of Dalith Studies, Delhi.)

దేశంలో వ్యవసాయ భూమి మొత్తం 146 మిలియన్ హెక్టార్లు లేదా 394.6 మిలియన్ల ఎకరాలు.

ప్రపంచంలో అతి పెద్ద సాగు భూమి మనదే. రెండవది అమెరికా.

ఇరిగేషన్ సౌకర్యం వున్నది 215.6 మిలియన్ల ఎకరాలు.

18.5 శాతం వున్న దళితుల వాటా 9 శాతం (2011 జనాభా లెక్కల ప్రకారం)

ఆదివాసీలు 11 శాతం (అటవీ ప్రాంతం)

మిగిలిన 80 శాతం - ఒసిలది, ఒబిసిలది.

దళితుల భూమిలో 61 శాతం 2 హెక్టార్లలోపే వుంటుంది. ఈ భూమి వలన దళితులకు అదనంగా వచ్చేఆదాయం ఏమీ వుండదు.

వర్గాలలో పేద, ధనికుల మధ్య ఆర్థిక వ్యత్యాసం వుంది. అదే అగ్ర, నిమ్న కులాల మధ్య ప్రతిబింబించింది. ధనవంతులు పేదల్ని దోచుకోవటం అంటే భారతదేశంలో అగ్రకులాలు నిమ్నకులాల్ని దోచుకోవటమే.

ఆర్థిక వనరులపై అగ్రకులాల యాజమాన్యం వుంది. అది అత్యధికంగా ఆ కులాలలోని అతికొద్ది శాతం కుటుంబాల చేతుల్లో కేంద్రీకరించబడింది. ఆర్థికవనరులపై యాజమాన్యమే వర్గాన్ని నిర్ణయిస్తుంది. అందువల్ల కులంలో వర్గం వుంది. వర్గంలో కులం వుంది. ఒకదానినొకటి పెనవేసుకొని వున్నాయి.

ఉత్పత్తి క్రమంలోనే కులం పుట్టింది. కులాల మధ్య సంబంధాలు ఉత్పత్తి సంబంధాలే. ఆర్థిక వనరులపై యాజమాన్యం, శ్రమదోపిడీ, పంపిణీ, సామాజిక ఘర్షణలు కులం అంతస్తును నిర్ణయిస్తాయి. ఇది కులంలోని ఆర్థిక అంశం.

కులం పుట్టుకతో వస్తుంది. వంశపారంపర్యంగా వెన్నాడుతుంది. కులం పుట్టుక గతజన్మల కర్మఫలం. ఎవరి కులధర్మాన్ని వారు ఆచరిస్తే, వచ్చే జన్మలో ఉత్తమ కులంలో జన్మిస్తారు. ఇది కులంలోని మత భావన. మతం అంటే విశ్వాసం.

కులంలో ఆర్థిక అంశం వుంది. సాంస్కృతిక అంశం వుంది. పునాది వుంది. ఉపరితలం లేదా భావజాలం వుంది.

పునాది మారటం అంటే కులాల అధికారమార్పిడి కాదు. ఒక కులం పోయి మరొక కులం అధికారంలోకి వచ్చినంతమాత్రాన కనీసం ఆ కులం ఆర్థిక పరిస్థితి మెరుగైపోదు. మండల్ కమిషన్ ప్రభావం బీహార్‌పై వుంది. గత కొన్నేళ్లుగా బిసిలే అధికారంలో వున్నారు. అయినా ఉద్యోగాలలో కొంత వాటా దక్కిందేగాని, బిసిల ఆర్థిక పునాది మారలేదు. ఈనాటికీ ఆర్థిక వనరులు ఓసిలకే, బ్రాహ్మణులు, భూమిహారులకే వున్నాయి. వారి ఆధిపత్యం చలామణి అవుతూనే వుంది. ఉత్తరప్రదేశ్‌లో యస్.సి. ముఖ్యమంత్రి అయినా దళితుల ఆర్థిక పరిస్థితిలో మార్పులేదు. పైగా 'బహుజన' నుండి 'సర్వజన'కి ప్లేటు ఫిరాయించినా ఫలితం దక్కలేదు.

పునాది మారడం అంటే రిజర్వేషనులు, ఉద్యోగాలు కాదు, ఆర్థిక వనరులపై యాజమాన్యం మారడం. భూస్వామ్య, పెట్టుబడిదారీవర్గాల ఆర్థిక వనరులు శ్రమజీవుల స్వాధీనం కావడం. అగ్రకులాల ఆర్థిక వనరులు దళిత, వెనుకబడిన కులాల యాజమాన్యంలోకి రావడం. ఒక్కమాటలో చెప్పాలంటే జాతీయ ఆదాయంలో ఎవరి పనికి తగిన వాటా వారికి లభించడం.

ఒక దళిత వ్యక్తి ప్రెసిడెంటు అయినంతమాత్రాన, ఒక వెనుకబడిన కులం వ్యక్తి ప్రధానమంత్రి అయినంతమాత్రాన, మరో గిరిజన స్త్రీ ముఖ్యమంత్రి అయినంత మాత్రాన ఒరిగేదేమీ లేదు. విధానాలను నిర్ణయించేది వ్యక్తులు కాదు, నిజానికి పార్టీలు కూడా కాదు. వారి వెనుక వున్న సామాజిక, ఆర్థిక శక్తులు. వాళ్ల ప్రయోజనాలను కాపాడటమే ప్రభుత్వాల విధ్యుక్త ధర్మం. ఆ ధర్మాన్ని ఆచరించినంతకాలం ఆ ప్రభుత్వం అధికారంలో వుంటుంది. లేనిచో తొలగింపబడుతుంది. అందువల్ల ఎవరు ఏ కులం అనేది ముఖ్యం కాదు. ఎవరు ఏ వర్గానికి, ఎవరి ఆర్థిక ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారనేది అసలు పాయింటు.

అందువల్ల పునాది మారటం అంటే ఆర్థికవనరులపై యాజమాన్యం మారటం. ఉత్పత్తి పంపిణీ మారటం. ఇందుకు వర్గపోరాటమే శరణ్యం. భారతదేశంలో వర్గపోరాటం గజిబిజిగా, సంక్లిష్టంగా వుండే మాట వాస్తవమే. ఇండియా బహుజాతుల, బహుభాషల దేశం. ఎక్కడా లేని కుల వివక్ష, దోపిడి, అణచివేత ఇక్కడ వుంది. ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టబడతాయి. ఆర్థికంగా, సాంస్కృతికంగా అభివృద్ధిలో అసమానతలు ఇందుకు దోహదం చేశాయి.

రాజకీయ చైతన్యం కొరవడినంతకాలం, సమాజంపట్ల శాస్త్రీయ అవగాహన లేనంతకాలం ప్రధాన శత్రువు తప్పించుకొంటూనే వుంటాడు. ప్రజల మధ్య చిచ్చు పెడుతూనే వుంటాడు.

భారతదేశంలో వర్గపోరాటం అంటే రెండు శిబిరాల మధ్య పోరాటం. పెట్టుబడిదారులు, బహుళజాతుల కంపెనీలు, భూస్వాములు ఒకవైపు, అశేష ప్రజానీకం మరోవైపు. వర్గం, కులం విడదీయరానివి. అగ్రకులాలకి, నిమ్నకులాలకి మధ్య జరిగే పోరాటం అంతిమ పరిశీలనలో వర్గపోరాటమే.

వర్గ పోరాటం ఏ రూపంలో వుంటుంది అనేది ఆనాటి సామాజిక ఆర్థిక, రాజకీయ పరిస్థితులు, పాలకవర్గాల వ్యూహం, ఎత్తుగడలు, ప్రజా చైతన్యంపై ఆధారపడి వుంటుంది.

పునాది మారినంతమాత్రాన వర్గపోరాటం ఆగదు. పాత పునాదికి పుట్టిన భావజాలం పోవాలి. అదే సాంస్కృతిక మార్పు. ఆలోచనావిధానంలో మార్పు. సుదీర్ఘ పోరాటం ద్వారానే ఇది సాధ్యం. భావజాలం ఆటోమాటిక్‌గా మారదు. ఆదిమ గణతంత్ర సమాజంలో సొంత ఆస్తి అనే భావన అసలు తెలియదు. వర్గాలు ఏర్పడినాక బానిస సమాజంలో ఆ భావం పాదుకుంది. అందుకు వందల ఏళ్లు పట్టింది. కుల భావనకు వ్యతిరేకంగా జరిగే పోరాటం వాయిదా వేయటం దీని అర్థం కాదు. ఇది నిరంతర పోరాటం.

ఆర్థిక వనరులపై యాజమాన్యం పొందటం మొదటి మెట్టు. బీద, బడుగువర్గాల అధికారానికది ఒక గొప్ప ముందడుగు. ఈ అడుగే సాంస్కృతిక విప్లవానికి దారి చూపుతుంది. అసమానత్వం, అంటరానితనంతో కూడిన కులం అనే భావన పోయిననాడే భారతదేశానికి నిజమైన స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సమానత్వం వచ్చినట్టు. నూతన సామాజిక వ్యవస్థ అంటే అదే.

****

కపిల (జనవరి)					2022	కణాద (ఫిబ్రవరి)				
	5	12	19	26	బుధ		2	9	16	23
	6	13	20	27	గురు		3	10	17	24
	7	14	21	28	శుక్ర		4	11	18	25
1	8	15	22	29	శని		5	12	19	26
2	9	16	23	30	ఆది		6	13	20	27
3	10	17	24	31	సోమ		7	14	21	28
4	11	18	25		మంగళ	1	8	15	22	

భగత్‌సింగ్ (మార్చి)					2022	కోవూరు (ఏప్రిల్)				
30	2	9	16	23	బుధ		6	13	20	27
31	3	10	17	24	గురు		7	14	21	28
	4	11	18	25	శుక్ర	1	8	15	22	29
	5	12	19	26	శని	2	9	16	23	30
	6	13	20	27	ఆది	3	10	17	24	
	7	14	21	28	సోమ	4	11	18	25	
1	8	15	22	29	మంగళ	5	12	19	26	

బుద్ధ (మే)					2022	అసితకేశ (జూన్)				
	4	11	18	25	బుధ	1	8	15	22	29
	5	12	19	26	గురు	2	9	16	23	30
	6	13	20	27	శుక్ర	3	10	17	24	
	7	14	21	28	శని	4	11	18	25	
1	8	15	22	29	ఆది	5	12	19	26	
2	9	16	23	30	సోమ	6	13	20	27	
3	10	17	24	31	మంగళ	7	14	21	28	

గోశాలి (జులై) 2022 వేమన (ఆగస్టు)

	6	13	20	27	బుధ	31	3	10	17	24
	7	14	21	28	గురు		4	11	18	25
1	8	15	22	29	శుక్ర		5	12	19	26
2	9	16	23	30	శని		6	13	20	27
3	10	17	24	31	ఆది		7	14	21	28
4	11	18	25		సోమ	1	8	15	22	29
5	12	19	26		మంగళ	2	9	16	23	30

పెరియార్ (సెప్టెంబర్) 2022 పాయసి (అక్టోబరు)

	7	14	21	28	బుధ		5	12	19	26
1	8	15	22	29	గురు		6	13	20	27
2	9	16	23	30	శుక్ర		7	14	21	28
3	10	17	24		శని	1	8	15	22	29
4	11	18	25		ఆది	2	9	16	23	30
5	12	19	26		సోమ	3	10	17	24	31
6	13	20	27		మంగళ	4	11	18	25	

శంబూక (నవంబరు) 2022 అంబేద్కర్ (డిసెంబర్)

30	2	9	16	23	బుధ		7	14	21	28
	3	10	17	24	గురు	1	8	15	22	29
	4	11	18	25	శుక్ర	2	9	16	23	30
	5	12	19	26	శని	3	10	17	24	31
	6	13	20	27	ఆది	4	11	18	25	
	7	14	21	28	సోమ	5	12	19	26	
1	8	15	22	29	మంగళ	6	13	20	27	

కొన్ని ముఖ్యమైన తేదీలు

కపిల (జనవరి)

3. చెరబండరాజు జయంతి (1939)
   సావిత్రిబాయి పూలే జననం (1831)
8. గెలిలియో వర్ధంతి
10. ఫ్రాన్సిస్కో ఫెర్రర్ గార్డియా జననం
11. థామస్ ఆల్వా ఎడిసన్ జననం
15. త్రిపురనేని రామస్వామి జననం (1887)
16. త్రిపురనేని రామస్వామి మరణం (1943)
19. కపిల జయంతి
21. లెనిన్ మరణం (1924)
26. భారతదేశపు అధికారపు మార్పిడి చట్టబద్ధం చేయబడ్డరోజు
26. ఎం.ఎన్.రాయ్ వర్ధంతి (1954)
29. థామస్ పేస్ జన్మదినం
29. జోసెఫ్ సైమ్స్ జననం
30. గాంధీ హత్య (1948)
30. చార్లెస్ బ్రాడ్లా మరణం (1891)

కణాద (ఫిబ్రవరి)

2. బెర్ట్రాండ్ రస్సెల్ మరణం (1970)
   ప్రపంచశాంతి దినోత్సవం
3. జాన్ గూటెన్‌బర్గ్ జయంతి
6. థామస్ ఆల్వా ఎడిసన్ జయంతి
12. ఛార్లెస్ డార్విన్ జననం (1809)
12,13. 30వ నాస్తికమేళా
15. గెలిలియో జయంతి
17. బ్రూనో మరణం (1600)
19. కోపర్నికస్ జయంతి
20. కణాద జయంతి
    గోవింద పన్సారే హత్య (2016)
21. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం
27. చంద్రశేఖర్ ఆజాద్ వీరమరణం (1931)
28. జాతీయ సైన్స్ దినోత్సవం

భగత్‌సింగ్ (మార్చి)

3. అలెగ్జాండర్ గ్రహంబెల్ జయంతి (1847)
5. స్టాలిన్ వర్ధంతి, (1953)
8. అంతర్జాతీయ మహిళా దినోత్సవం (1910)
10. సావిత్రీభాయి పూలే వర్ధంతి (1897)
14. కారల్ మార్క్స్ మరణం (1883)
18. కమ్యూనిస్టు ప్రణాళిక ప్రకటన
18. ప్యారిస్ కమ్యూన్ ఏర్పాటు
20. న్యూటన్ వర్ధంతి
23. భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల ఉరి (దీక్షాదినం) (1931)
25. వేమన జయంతి
28. మాక్సిం గోర్కి జననం (1868)

కోవూరు (ఏప్రిల్)

6. జేమ్స్ వాట్ జయంతి
10. ఎ.టి. కోవూర్ జననం (1898)
11. జ్యోతిరావు పూలె జననం (1827)
12. అంతరిక్షంలో మానవ ప్రవేశం
    యూరి గగారిన్
14. జలియన్ వాలాబాగ్ దురంతం (1919)
14. అంబేద్కర్ జయంతి (1891)
16. వీరేశలింగం జననం (1848)
18. చార్వాక రామకృష్ణ మరణం, (2007)
    ఐన్‌స్టీన్ వర్ధంతి (1955)
19. చార్లెస్ డార్విన్ మరణం (1882)
22. లెనిన్ జననం (1870)
30. శ్రీ శ్రీ జయంతి (1910)

బుద్ధ (మే)

1. కార్మిక హక్కుల దినోత్సవం (1886)
5. ఫ్రెంచి విప్లవం
5. చైనా విప్లవ ప్రభుత్వ స్థాపన
5. కారల్ మార్క్స్ జననం (1818)
7. అల్లూరి సీతారామరాజు కాల్చివేత
8. తాపీ ధర్మారావు వర్ధంతి
10. భారత ప్రథమ స్వాతంత్ర్య పోరాటం (1857)
18. బెర్ట్రాండు రస్సెల్ జననం (1872)
24. కోపర్నికస్ మరణం
28. పారిస్ కమ్యూన్ పతనం. (1871)

అసితకేశ (జూన్)

2. ఆంధ్రప్రదేశ్/తెలంగాణా విభజన (2014)
   మార్కోని రేడియో కనుగొన్న రోజు
3. ఇండియా విభజన ప్రకటన
8. థామస్ పేస్ మరణం
15. శ్రీశ్రీ మరణం (1983)
18. మాక్సిం గోర్కి మరణం (1936)
22. అసితకేశ కంబళ్ జయంతి.
    గెలిలియో మరణం

గోశాలి (జులై)

1. చార్వాక రామకృష్ణ జయంతి (1940)
4. అమెరికా స్వాతంత్ర్య దినం
   మేరీ క్యూరీ వర్ధంతి
   అల్లూరి జయంతి
9. మఖ్కలి గోశాలి జయంతి
14. ఫ్రెంచి విప్లవ దినం
20. రాబర్ట్ గ్రీన్ ఇంగర్ సాల్ మరణం
21. చంద్రుడిపై మొదటి మానవుడి ప్రవేశం
24. గుర్రం జాషువా మరణం (1971)
25. చార్వాక అయ్యన్న వర్ధంతి
26. గోరా మరణం (1975)
26. ఫ్రాన్సిస్కో ఫెర్రర్ గార్డియా మరణం
28. మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభం (1914)

వేమన (ఆగస్టు)

2. గ్రహంబెల్ మరణం
5. ఏంగిల్స్ మరణం (1895)
6. అలెగ్జాండర్ ఫ్లెమింగ్ జననం
6. హిరోషిమాపై ఆటంబాంబు ప్రయోగం (1945)
9. క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభం
9. నాగసాకిపై ఆటంబాంబు ప్రయోగం (1945)
12. ఇంగర్‌సాల్ జననం
15. భారతదేశపు అధికారపు మార్పిడి
20. డా॥ నరేంద్ర దబోల్కర్ హత్య (2013)
23. సుభాష్‌చంద్ర బోస్ జననం
28. వేమన జయంతి
30. కల్బుర్గి హత్య

పెరియార్ (సెప్టెంబర్)

1. అజాద్ హిందూఫౌజ్ స్థాపన
3. రెండో ప్రపంచయుద్ధం ప్రారంభం
3. వెస్టర్ మార్క్ జననం
3. జాతీయ పౌరహక్కుల దినం
5. ఫ్రాన్సిస్ రైట్ జననం,
9. మావో సె టుంగ్ మరణం (1976)
10. చిట్యాల ఐలమ్మ మరణం (1985)
17. ఇ.వి. పెరియార్ జననం (1879)
18. కోవూరు మరణం (1978)
19. తాపీ ధర్మారావు జయంతి
25. లూషన్ జననం
26. చార్లెస్ బ్రాడ్లా జననం (1833)
28. భగత్‌సింగ్ జననం (1907)
28. మొదటి అంతర్జాతీయ సంస్థ స్థాపన
28. గుర్రం జాషువా జయంతి (1895)

పాయసి (అక్టోబర్)

1. చైనా రిపబ్లిక్ దినోత్సవం (1949)
7. భగత్‌సింగ్ జయంతి
11. పాయసి జయంతి
18. థామస్ ఆల్వా ఎడిసన్ మరణం
19. లూషన్ మరణం (1936)
22. కొమరంభీం జయంతి
24. ఐక్యరాజ్యసమితి అవతరణ (1945)
31. పూర్ణకాశ్యప జయంతి

శంబూక (నవంబర్)

7. రష్యా ప్రజాతంత్ర ప్రభుత్వ అవతరణ (1917)
   మేడమ్ క్యూరీ జయంతి
10. సి.పి. బ్రౌన్ జయంతి
11. మొదటి ప్రపంచ యుద్ధం (1917)
15. గోరా జననం (1902)
20. వెస్టర్ మార్క్ మరణం
24. సైంటిఫిక్ థాట్ డే (ది ఆరిజన్ ఆఫ్ ది స్పిషీస్ పుస్తక ప్రకటన)
28. జ్యోతిరావ్ ఫూలే మరణం (1890)
28. ఏంగిల్స్ జననం (1820)

అంబేద్కర్ (డిసెంబర్)

6. డా॥ బి.ఆర్. అంబేద్కర్ మరణం (సమతా దినోత్సవం) (1956)
6. బాబ్రీ మసీదు కూల్చివేత (1992)
9. డా॥ కొట్నీస్ వర్ధంతి
10. ఆల్‌ఫ్రెడ్ నోబుల్ వర్ధంతి
10. అంతర్జాతీయ మానవ హక్కుల దినం (1896)
13. ఫ్రాన్సీస్ రైట్ మరణం (1853)
17. రైట్ సోదరుల మొదటి ఆకాశయానం (1903)
18. సంజయ వేలట్టిపుత్త జయంతి
20. స్టాలిన్ జయంతి (1879)
24. ఇ.వి. పెరియార్ మరణం (1973)
25. మనుస్మృతి దహన దినోత్సవం
26. మావో సెటుంగ్ జననం (1893)
29. సైమ్సు మరణం

సెలవు దినాలు

కపిల (జనవరి)

3. సావిత్రిబాయి పూలే జననం (1831)
   ఉపాధ్యాయ దినోత్సవం
10. ఫ్రాన్సిస్కో ఫెర్రర్ గార్డియా జననం
   శాస్త్రీయ విద్యా ప్రచార దినోత్సవం
21. లెనిన్ మరణం (1924)
30. చార్లెస్ బ్రాడ్లా మరణం (1891)

కణాద (ఫిబ్రవరి)

10. ప్రపంచశాంతి దినోత్సవం
12,13. 30వ నాస్తిక మేళా

భగత్‌సింగ్ (మార్చి)

8. అంతర్జాతీయ మహిళా దినోత్సవం (1910)
14. కారల్ మార్క్స్ మరణం (1883)
23. భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల ఉరి (దీక్షాదినం) (1931)

కోవూరు (ఏప్రిల్)

14. అంబేద్కర్ జయంతి (1891)
18. చార్వాక రామకృష్ణ వర్ధంతి (2007)

బుద్ధ (మే)

1. కార్మిక దినోత్సవం

అసితకేశ (జూన్)

18. గోర్కీ మరణం
   ప్రజాసంస్కృతి దినోత్సవం

గోశాలి (జులై)

20. రాబర్ట్ గ్రీన్ ఇంగర్‌సాల్ మరణం
26. ఫ్రాన్సిస్కో ఫెర్రర్ గార్డియా మరణం

వేమన (ఆగస్టు)

5. ఏంగిల్స్ మరణం (1895)
20. డా॥ నరేంద్ర దబోల్కర్ హత్య (2013)
30. కల్బుర్గి హత్య

పెరియార్ (సెప్టెంబర్)

5. ఫ్రాన్సిస్ రైట్ జననం
   మహిళా హక్కుల దినం
9. మావో సెటుంగ్ మరణం (1976)
10. చిట్యాల ఐలమ్మ మరణం (1985)
17. ఇ.వి. పెరియార్ జననం (1879)
26. చార్లెస్ బ్రాడ్లా జననం
28. భగత్‌సింగ్ జననం (1907)

శంబూక (నవంబర్)

7. అక్టోబరు విప్లవం

అంబేద్కర్ (డిసెంబర్)

6. సమతా దినోత్సవం
10. మానవ హక్కుల దినం

నాస్తిక సమాజం

* నాస్తికులు దోపిడీవర్గంలోనూ వున్నారు. వారు కేవలం నాస్తికులు. అలాంటి నాస్తికుల వల్ల ఏ ప్రయోజనమూ పీడిత ప్రజలకు కలగదు. నాస్తికత అనేది దోపిడీ మూలాలను తెలుసుకునేదిగా, దోపిడీవర్గ కుతంత్రాలను కనుగొనేదిగా, దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా నిలబడేదిగా వుండాలి. దోపిడీ నుండి కష్టజీవుల విముక్తి కోసం జరిగే కృషికి నాస్తికవాదాన్ని తోడుచేసి, ఈ దోపిడీ సమాజాన్ని కూల్చడానికి రామకృష్ణగారు 'నాస్తికసమాజాన్ని' స్థాపించారు.
* కుల, మత వర్గ భేదాలు లేని సమసమాజ నిర్మాణమే నాస్తిక సమాజ లక్ష్యం. ఈ లక్ష్యసాధనకై చేసిన కొన్ని కార్యక్రమాల వివరాలు :
* 1977వ సంవత్సరంలో జాతీయ నాస్తిక మహాసభలను మూడు రోజుల పాటు చార్వాక విద్యాపీఠంలో నిర్వహణ. దీనికి ఏ.టి. కోవూరుగారు ముఖ్యఅతిథిగా వచ్చారు.
* జిల్లెళ్లమూడి అమ్మ, సత్యసాయిబాబా, ముమ్మిడివరం బాలయోగి, నంబూరు దగ్గరున్న కాళీకృష్ణ, బాలసాయిబాబా మొదలగు వారి మాయాజాలాన్ని పటాపంచలు చేస్తూ కరపత్రాలు వేయటం సభలు నిర్వహించడం.
* విజయవాడకు సత్యసాయిబాబా వచ్చినపుడు మిగతా ప్రజాసంఘాలతో కలసి నిరసన ప్రదర్శన.
* తెలంగాణ ప్రాంతంలో నేటికీ కొనసాగుతున్న బాణామతి, చేతబడి వంటి దురాచారాలకు వ్యతిరేకంగా 15 రోజుల క్యాంపెయిన్.
* కొండమొదలు ప్రాంతంలో ప్రజలలో వున్న మూఢనమ్మకాలను పోగొట్టటానికి రెండు నెలలపాటు మ్యాజిక్‌షోలు, సభలు నిర్వహించడం.
* తిరుపతిని వాటికన్ సిటీగా మార్చాలన్న ప్రభుత్వ ఆలోచనలను వ్యతిరేకిస్తూ సభలు, ఆందోళనా కార్యక్రమాల నిర్వహణ.
* ప్రముఖ భౌతికవాది "ప్రేమానంద్"తో కలిసి రాష్ట్ర వ్యాపితంగా అనేక ఇంద్రజాల ప్రదర్శనలు.
* 'రామ రథయాత్ర'కు సవాలుగా రాముడి ఖడ్గానికి బలయ్యాడని చెప్పబడుతున్న 'శూద్ర శంబుకుని రథయాత్ర' నిర్వహణ.
* ప్రత్యామ్నాయ సంస్కృతి నిర్మాణంలో భాగంగా 1992 సంవత్సరం నుండి 'నాస్తికమేళా' నిర్వహణ.
* అణువిద్యుత్ కేంద్రాలకు వ్యతిరేకంగా కార్యక్రమాల నిర్వహణ.
* కుల నిర్మూలనలో భాగంగా వందలాది, కులాంతర, మతాంతర వివాహాల నిర్వహణ.
* విగ్రహాలు పాలు తాగడం, విగ్రహాల నుండి విభూది రావడంపై శాస్త్రీయ వివరణ ఇచ్చి ప్రజలను చైతన్యపరచడం.
* పౌర, ప్రజాస్వామిక, మహిళా హక్కుల పరిరక్షణ ఉద్యమాలతో కలసి అనేక కార్యక్రమాల నిర్వహణ.
* పుట్టపర్తి సత్యసాయిబాబా మహిమలను సవాల్ చేస్తూ పుట్టపర్తిలో ధర్నా నిర్వహణ.

చార్వాకాశ్రమం

* నాస్తిక, శాస్త్రీయ భావజాలం విస్తృత ప్రజానీకంలోకి వెళ్ళేందుకై ఒక సాంస్కృతికోద్యమ కేంద్రం అవసరమని గుర్తించిన రామకృష్ణగారు, మూఢనమ్మకాలను, అశాస్త్రీయ భావాలను లేత మనసుల్లోకి ఎక్కించే దుష్ట సంప్రదాయానికి భిన్నంగా ప్రత్యామ్నాయ విద్యావిధానంగల పాఠశాలను ప్రారంభించాలన్న ఆలోచన, ఆశయానికి రూపకల్పన చేస్తూ 1973 సంవత్సరంలో 'ప్రగతి విద్యావనం' పేరుతో పాఠశాలను ప్రారంభించారు.
* ప్రాచీన భారత భౌతికవాదులైన చార్వాకులు, లోకాయతుల ఆలోచనాధారను మార్క్సిజంతో మేళవించి ప్రజానుకూలమైన సంస్కృతిని నిర్మించడానికి పునాదులు వేసే పాఠశాలగా దీనిని నడిపారు.
* దేశీయ తత్త్వశాస్త్రంలో భౌతికవాదంతో కూడిన చార్వాక దర్శనాన్ని సూచిస్తూ స్కూలు పేరును 'చార్వాక విద్యా పీఠం'గా పేరు మార్చారు.
* ప్రశ్నించటం, తర్కించటం, మేధోవికాసానికి ఉపయోగపడే లక్షణాలను పిల్లల్లో ప్రోత్సాహించాలన్న లక్ష్యంతో పాఠశాల కార్యక్రమాలు రూపొందించారు.
* మాతృభాషలోనే విద్యాబోధన సాగాల్సిన ఆవశ్యకతను గుర్తించి దానిని అమలు చేశారు.
* సమాజాన్ని, సమాజ పరిణామ క్రమాన్ని ప్రస్తుత పరిస్థితులను వాటి మూలాలను తెలియజెప్పి, పిల్లల్లో భౌతికవాద పునాదిని వేయటానికి కృషి చేశారు.
* కులమతాలను అంతం చేసే వైపుగా, పీడననంతం చేసే వైపుగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించేవారు.
* మతప్రసక్తి, దైవప్రసక్తి లేని పాఠ్యగ్రంథాలను ప్రచురించారు.
* హోమియో, ఆయుర్వేదం, ఆక్యుపంక్చర్, అల్లోపతి, వైద్యశిబిరాలను గ్రామాలలో నిర్వహించి, భూత వైద్యులచేత మంత్రాలు పెట్టించుకోకూడదని ఆరోగ్యం పట్ల శాస్త్రీయ భావనను ప్రచారం చేశారు.
* ఆశ్రమంలో సంస్కర్తల, ప్రగతిశీలవాదుల, ప్రాచీన భౌతికవాదుల విగ్రహాలు ఆవిష్కరించారు.
* భగవద్గీతకు ప్రత్యామ్నాయంగా 'చార్వాకగీత' సంస్కృత శ్లోకాలలో రాసి, వ్యాఖ్యానంతో ఆడియో క్యాసెట్‌గా విడుదల చేశారు.
* దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించిన కాలంలోనూ, అంతకు ముందు కూడా చార్వాకాశ్రమం ఎందరో దేశభక్తులకు ఆశ్రయమిచ్చింది.
* మార్క్సిజాన్ని నమ్మిన వివిధ సంఘాలకు సంబంధించిన కార్యకర్తలు, నాయకులు చార్వాకాశ్రమానికి సుపరిచితులే.
* చార్వాక విద్యాపీఠంలో నాస్తిక ప్రజాసాహిత్యం ముద్రణ కొరకు ముద్రణాలయము ఏర్పాటు చేశారు. లోకాయత ప్రచురణలు, చార్వాకాశ్రమ ప్రచురణల పేరుతో ప్రచారం చేశారు.
* 'నాస్తికయుగం', 'నాస్తికత్వం', 'చార్వాకం', 'వాయిస్ ఆఫ్ చార్వాక' మొదలగు పత్రికలను ప్రచురించారు.
* 1982 సంవత్సరము నుండి చార్వాక కేలండర్ పేరుతో నాస్తిక కేలండర్ ముద్రిస్తున్నారు.
* ప్రతి సం॥ నాస్తిక అధ్యయన తరగతుల నిర్వహణ.